ప్రజాశక్తి ఆదివారం అనుబంధం
సెప్టెంబర్ 20, 2009
రసరమ్యం
రంజాన్ పర్వం

హ్యాపీబర్త్‌డే

(౨౦౦౯ సెప్టెంబర్ ౨౦ నుంచి ౨౦౦౯ సెప్టెంబర్ ౨౬ వరకు)

బి. వర్షిణి
1సం॥, సెప్టెంబర్-20
మాధవి-పద్మరాజు
శ్రీనివాసపురం-నల్లగొండ

డి. నవీన్‌కుమార్
సెప్టెంబర్
సత్తెమ్మ-మైసయ్య
పెద్దతూండ్ల-రంగారెడ్డి

ఎస్. విశాల్‌తేజ
సెప్టెంబర్
పద్మజ-గిరిప్రసాద్
భద్రాచలం

కె. శివాని
4సం॥, సెప్టెంబర్-23
భారతి-రవీందర్
వరంగల్

ఎస్. వర్షిత
సెప్టెంబర్
పద్మజ-గిరిప్రసాద్
భద్రాచలం

కె. సత్యసాయి దుర్గ
సెప్టెంబర్
విజయలక్ష్మి-వెంకటసత్యం
కాజులూరు-కాకినాడ

కె. వైదేవి
6సం॥, సెప్టెంబర్-21
సుజాత-వినోద్‌కుమార్
ఫతేనగర్-హైదరాబాద్

కె. వందన సాయి చంద్రిక
7సం॥, సెప్టెంబర్-21
విజయలక్ష్మి-వెంకటసత్యం
కాజులూరు-కాకినాడ

సి. సాత్విక
4సం॥, సెప్టెంబర్-2005
కవిత-శశిభూషణరెడ్డి
అనంతపురం

బి. భావనశ్రీ
1సం॥, సెప్టెంబర్-2008
సరస్వతి-వెంకటేశ్వరరావు
రావినూతల-ఖమ్మం

ఆర్. విష్ణువర్ధన్
1సం॥, సెప్టెంబర్-23
సంగీతలక్ష్మి-సంతోష్‌కుమార్
కుద్బిగూడ-హైదరాబాద్

సాయి చరణ్
సెప్టెంబర్-22
రాజ్యలక్ష్మి-బసవరాజు
కౌసిగి-కర్నూలు

మహబూబ్ బాషా
6సం॥, సెప్టెంబర్-24
ఆశ-కాశింవలి
కర్నూలు

ఆర్. భీష్మబ్రహ్మణి
8సం॥, సెప్టెంబర్-25
కల్పన-బాలకృష్ణ
నాగర్‌కర్నూలు-మ॥నగర్

సిహెచ్. దినేష్
10సం॥, సెప్టెంబర్-22
సునీత-గోపి
మామిడికుదురు-తూ॥గో॥

వి. భావన
6సం॥, సెప్టెంబర్-2003
జ్యోతి-పరశురాం
రామంతపూర్-హైదరాబాద్

మనలో మాట

బాబోయ్ బంగారం!



ఇదివరలో బంగారం అన్న మాట వినబడితే చాలు! కళ్లల్లో మెరుపుల్ మెరిసేవి. తళుకుల్ పూసేవి. ఇప్పుడో! సీన్ పూర్తిగా మారిపోయింది. కరెంటు షాక్ కొట్టినట్టు 'వామ్మో! బంగారమా' అన్న మాట అప్రయత్నంగా నోటెంట వచ్చేస్తోంది. మరి పది గ్రాముల పుత్తడి ధర పదహారువేల రూపాయలకు పైగా పలుకుతోంది. దీపావళినాటికి పద్దెనిమిది వేలదాకా పోనుందని పత్రికలు రోజూ రాసేస్తున్నాయి. టీవీలు గోలపెడుతున్నాయి. విచిత్రం కాకపోతే ఇటు పప్పూ, బియ్యం ధరలూ ఆకాశాన్నంటాయి. అటు బంగారం రేటూ చుక్కలనంటుతోంది. కూరగాయలు కొనడానికి నానా తిప్పలు పడే సామాన్యుడే కాదు కాస్తో కూస్తో స్థితిమంతుడు కూడా బంగారం వైపు కన్నెత్తి చూసే సాహసం చేయలేకపోతున్నాడు. ఇదేమాట పెద్దోళ్లతో అంటే ఏమంటారు? మారు ఆలోచన లేకుండా 'కలికాలం' అనేస్తారు. కానీ దాన్ని 'కాలే కాలం' అని సరిదిద్దుకుంటే బావుంటుందేమో!

అయితే ఇంత ఖరీదైన బంగారానికి భద్రత ఎక్కడుంటుంది చెప్పండి. బంగారం కోసం ప్రాణాలను సైతం కూల్‌డ్రింక్ తాగినంత ఈజీగా తీసి పారేస్తున్నారు. బాగా బంగారం వున్న ఇల్లు చూసుకోవడం.. ఇంట్లో ఎవరూ లేని సమయం తెల్సుకోవడం...కాలింగ్‌బెల్లు కొట్టడం...తలుపుతీసిన మనిషి పీక నులమడం...బీరువాలు పగలకొట్టి బంగారు ఆభరణాలు నొక్కేయడం. ఎన్ని చూడట్లేదు టీవీల్లో, పేపర్లలో.

చిన్నదో..సన్నదో పుత్తడి దారం మెళ్లో వేసుకొని వీధిలో నడవడానికి కూడా లేకుండాపోయె. సైకిల్‌మీదో, బైక్‌మీదో వచ్చి ఎవడు గుంజుకుపోతాడోనని బెరుకుబెరుగ్గా నడవాల్సివస్తోంది. అందాకా ఎందుకు? పిల్లల చెవులకు, ముక్కుకు వున్న కొద్దిపాటి బంగారం కోసం ఏకంగా కిడ్నాప్ చేసేస్తున్న ఉదంతాలూ వున్నాయ్ కదా.

ఏదైనా తప్పు చేస్తే 'అమ్మో! దేవుడు కళ్లుపోగొడతాడు' అంటుంటారు. అలాంటి దేవుడి కన్నుగప్పి ఆయన నగల్నే మాయం చేసేస్తున్నారు. వీలుంటే అమ్ముకుంటున్నారు. కాకపోతే తాకట్టుపెట్టుకుని పబ్బం గడుపుకుంటున్నారు. విషయం బయటపడి అడిగితే... అంతా పైవాడే చేయిస్తున్నాడని బుకాయింపొకటి. నాటి విజయవాడ కనకదుర్గమ్మను మొదలుకొని నేటి తిరుపతి కోదండరాముడి వరకు ఇదే సీన్ కదా.

ఓవైపు పుత్తడి ధర ఇంతగా పెరుగుతోంటే మరోవైపు పెళ్లికావాల్సిన పిల్లలున్న తల్లిదండ్రులకు బీపీ పెరుగుతోంది. పిల్ల బొద్దుగా ముద్దుగా బావుందంటారు కళాహృదయంతో. కానీ కట్నం ఇవ్వక్కర్లేదంటారు ఉదారంగా. అయితే నగానట్రా అలంకరించి పుత్తడి బొమ్మలా పంపమంటారు ముక్తాయింపుగా. ఆ ఒక్కమాట చాలు! పిల్ల తండ్రి గుండె 'లబ్‌డబ్' అని కాకుండా 'గోల్డ్ గోల్డ్' అని కొట్టుకోవడానికి!!

పూర్వకాలంలో కాబట్టి పులి బంగారు కంకణం పెట్టుకుందని, బాతు బంగారు గుడ్డు పెట్టిందని, దేవత బంగారు గొడ్డలి తెచ్చిందని, చీమకు బంగారు పుట్ట వుందని రాశారు కథకులు. అదే ఇప్పటి రచయితలైతే అలా రాయగలరా!

కానీ ఒక్క విషయంలో మాత్రం బంగారనామ జపం పనికొస్తుంది. అదేనండీ...రోజువారీ ఖర్చులు భరించలేని పేదవాడు మొదలుకొని... ఖాళీ ఖజానాతో రాష్ట్ర ప్రభుత్వమనే నావను ఈడ్చుకురాలేని నూతన ముఖ్యమంత్రి వరకు 'ఉన్నపళంగా లంకెబిందెలు దొరికితే బావుండు. ఎలాగోలా నడిపించేయొచ్చు బండిని' అనుకోవడానికి. కాదంటారా?

★

ఈ సంచికలో....

టపా	...	2
నవ్వుల్ పువ్వుల్	...	3
రుచి	...	6
సీరియల్	...	10
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
కవిత్వమ్	...	18
తెల్సా	...	20
క్రైమ్ కథ	...	21
కథ	...	22
కొత్తపుస్తకాలు	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

యువమేధ మెరుపు
జీవితానికే మలుపు

చూద్దామా ... 7

అరుణారుణ ఛాయల్లో...
శాంతి... సౌభాగ్యం...

ఆరోగ్యం ... 19

గుండెపోటు
ఎవరికి ఎందుకు వస్తుంది?



త్రిపుర విశేషాలు తెలుసుకున్నాం

సెప్టెంబర్ మాసం తొలి ఆదివారం సంచిక స్నేహలో అట్టమీది కథగా 'ఆదర్శసీమ త్రిపుర' ద్వారా త్రిపుర విశేషాలన్నింటినీ తెలుసుకోగలిగాం. చూద్దామాలో 'లుంబినీ విశేషాలు' ఆకట్టుకున్నాయి. గనారా అందించిన 'భైరవుడు' కథ బావుంది. సామాజిక స్పందనల సౌందర్య చిత్రాలను అందించిన బెంగాలీ చిత్రకారిణి 'కొయిలీ ముఖర్జీ'కి కళాభినందనలు. 'తెల్సా' శీర్షికలో అన్నీ అంశాలు కుతూహలం కలిగించే విధంగా వున్నాయి. 'వంకాయ' అంటే పడి చచ్చేవాళ్లు ఈసారి వంకాయ స్పెషల్‌ను తప్పక ఫాలో అవుతారని విశ్వసించవచ్చు. 'సమ్‌థింగ్ స్పెషల్'లో డా॥ విజయ్ గారి రచన ద్వారా అల్లం, బెరడు... ఇత్యాది ఆరోగ్యపరమైన ఆహర పదార్థాల లోటుపాట్లను మా ముందుంచే ప్రయత్నం చేశారు. చదువు కన్నా ముందు ప్రాణమే గొప్పది, విలువైనదనీ ముందుగా చిన్నారుల హృదయాలకు హత్తుకునేలా చేయాలన్న 'మనలోమాట'ను అందరం విందాం. స్పందిద్దాం!!

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

చక్కటి వివరణ

సెప్టెంబర్ 6వ తేదీ ఆదివారం సంచికలోని అట్టమీదికథ 'ఆదర్శ సీమ త్రిపుర'లో వాస్తవాలను చక్కగా వివరించారు. చిన్న రాష్ట్ర నేతలు సామర్థ్యంతో ముందడుగు వేయడం హర్షణీయం. భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడిన 1956 నవంబర్ 1 వ తేదీనుండి భారత ప్రభుత్వంతో కలిసిన ఆదివాసి ప్రాంతాలతో నిండిన త్రిపుర నేడు విభిన్న రీతులలో అభివృద్ధి కావడం తెలుసుకోవలసిందే.

ఆచార్య నూతి నారాయణ,
గడ్డి అన్నారం, హైదరాబాద్.

ఆకట్టుకుంటున్న ఆకు జంతువులు

'బాల నేస్తాలు'లో ఇస్తున్న ఆకు జంతువులు పిల్లలకు బాగా నచ్చుతున్నాయి. తియ్యని పండులాంటిది స్నేహం అనడం బాగుంది. వంకాయ స్పెషల్ లో వంటకాలు అద్భుతంగా వున్నాయి. త్రిపుర రాష్ట్రంలోని అభివృద్ధిని చూసిన తర్వాత చిన్న రాష్ట్రాలు ఏర్పాటు చేయడం మంచిదేనేమో అనిపిస్తుంది. లుంబినీ అందాలు చదివిన తర్వాత చూసి తీరవల్సిందే అన్నట్టుగా వున్నాయి.

వాస్తు రామచంద్ర,
రాంజీనగర్, నెల్లూరు.

అభివృద్ధికి సూచిక

సెప్టెంబర్ తొలివారం ప్రజాశక్తి అనుబంధంలో అట్టమీది కథ "ఆదర్శసీమ త్రిపుర" చదివిన తర్వాత సుదీర్ఘ కాలం పాటు తీవ్రవాదుల ప్రాబల్యంతో అట్టుడికిన త్రిపుర రాష్ట్రం అభివృద్ధి చెందడం, వారి జీవన విధానంలో మార్పు రావడం అభినందనీయం. ఏడు ఈశాన్య రాష్ట్రాలలో ఒకటైన త్రిపుర గతంలో బ్రిటీష్ రాజరిక పాలనలో మగ్గడం, 1947 సెప్టెంబర్ 9న భారత్‌లో విలీనమవడం, అక్టోబర్ 15 తర్వాత భారత్ ప్రభుత్వం కిందికి రావడం, 1972 జనవరి 21 నుండి త్రిపురకు రాష్ట్ర హోదా లభించడం తెలుసుకున్నాం. 10,492 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం గల త్రిపుర 60శాతం గుట్టలమయమై వుండి అడవులను కల్గి అక్షరాస్యతలో 82 శాతం వుండడం హర్షదాయకం. కేవలం 4 జిల్లాలు, 15 సబ్ డివిజన్లు వున్న త్రిపుర విద్యారంగంలో ముందుండడం, మారుమూల గ్రామాల్లో కూడా మరుగుదొడ్లు వుండడం అభివృద్ధికి సూచికగా తెలుస్తుంది. వారు నివసించే "టాంగ్‌హట్‌లు", వారి దుస్తులూ చూడ ముచ్చటగా వున్నాయి. వ్యాసకర్తకి అభినందనలు.

కామిడి సతీష్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి,
రవీందర్ రెడ్డి, పరకాల, వరంగల్.

అలరించిన 'అలీబాబా...'

ఆగస్ట్ చివరి ఆదివారం స్నేహలో 'అట్టమీది కథ' ద్వారా వాస్తవాలను మాముందుంచారు. 'తెల్సా'లో పాముగూళ్లు వంటి అనేక అంశాలు ఆకట్టుకునేలా వున్నాయి. వేటికవే చిత్ర కదంబం బాగుంది. కొన్ని వారాలుగా ఎంతగానో అలరింప చేస్తూ ముగిసిన "అలీబాబా 40 దొంగలు" కథను ధారావాహికంగా అందించిన చరితకు



అభినందనలు. ప్రధానంగా నన్ను వ్యక్తిగతంగా ఆకర్షించింది 'బహుముఖ సుదర్శనం'. నేను నాగార్జున సాగర్ లో ఇంటర్ చదివేటప్పుడు సుదర్శన్ గారే మాకు డ్రాయింగ్ మాస్టారుగా వుండేవారు. ఈ విధంగా పాత జ్ఞాపకాలన్నీ తలచుకున్నాను. మా మాస్టారుని మళ్లీ జ్ఞప్తికి తెచ్చినందుకు కృతజ్ఞతలు. 'బాలనేస్తాలు'లో నేర్చుకుందాం బిట్ ఎంతో బావుంది. 'విజ్ఞాన వీచిక' సూపర్ ఫైన్‌గా వుంటోంది. 'ఆరోగ్యం' శీర్షిక వైద్యపరమైన సంగతులపై అవగాహనను కలిగిస్తోంది. 'ఆయా' కథ నచ్చింది. అమర్ గారి 'బంగీజంప్ విశేషాలు' విలువైన సమాచారాన్ని అందించింది. మనలో మాటలో ఆ దేవుడు మనల్ని రక్షించడం ఏమో గానీ ముందు ఆయన ఆభరణాల్ని పోగొట్టుకోకుండా చూసుకోవాలని మనవి.

సుభాష్, శ్రీకాకుళం.

కథలకు ఆహ్వానం

మన చుట్టూ అనేక సంఘటనలు జరుగుతుంటాయి. వీటిలో ఎన్నో సంఘటనలు మనసును మెలిపెడుతుంటాయి. అవి సామాజికమైనవి కావచ్చు. ఆర్థికమైనవి కావచ్చు. మరేవైనా కావచ్చు. వాటిని ప్రతిబింబించే... బాధితులను చైతన్యపరిచే... సామాజిక స్పృహ కలిగించే... కథలను మాకు పంపండి. ప్రచురిస్తాం. ఆకర్షణీయమైన పారితోషికం వుంటుంది. అయితే తెల్లకాగితం మీద ఒకవైపు మాత్రమే రాయాలి. రాతలో ఏడు కాగితాలకు మించకూడదని మనవి.

మా చిరునామా:
కథ శీర్షికకు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.

నవ్వుల్ - పువ్వుల్

ఫార్ములా

టీచర్ : నీరు ఫార్ములా ఏంటి?
విద్యార్థి : హెచ్ ఐ జె కె ఎల్ ఎమ్ ఎన్ ఒ
టీచర్ : ఏంటిది?
విద్యార్థి : అవును టీచర్, మీరు నీరు పాఠం చెప్పినప్పుడు ఫార్ములా చెప్తూ హెచ్ టు ఓ అన్నారుగా. అందుకే హెచ్ నుంచి ఓ వరకు అన్ని అక్షరాలు చెప్పేశాను.

చూడకుండా

కొడుకు : నాన్నా! నువ్వు కళ్లు మూసుకొని సంతకం చేయగలవా?
తండ్రి : అదో పెద్ద లెక్కా!
కొడుకు : అయితే నా ప్రోగ్రెస్ రిపోర్ట్ మీద పెట్టి చూపించు.

దగ్గు

రోగి : డాక్టర్! నాకు విపరీతంగా దగ్గు వస్తోంది. దగ్గడానికే ఓపికంతా అయిపోతోంది. ఏదైనా మందు రాసివ్వండి.
డాక్టర్ : ఇదిగో ఈ మందులు వాడండి.
రోగి : ఇవి వేసుకుంటే దగ్గు తగ్గిపోతుందా డాక్టర్?
డాక్టర్ : లేదు ... దగ్గడానికి ఓపిక వస్తుంది.

చిన్నచూపు

భార్య : ఏంటలా భూతద్దంలోంచి నా మొహం చూస్తారు?
భర్త : రోజూ చిన్నచూపు చూస్తున్నానని గోలచేస్తున్నావుగా!

గొప్పవాడు

ఓ వ్యక్తి : మా వాడు చాలా గొప్పవాడు. ఎవరైనా వాడి ముందు టోపీ తీయాల్సిందే.
రెండవ వ్యక్తి : అంటే మీ వాడు జడ్జీనా!
మొదటి వ్యక్తి : కాదు. సెలూన్ ఓనరు.

కాలు పెట్టొద్దు

తండ్రి : ఏంట్రా! అలా చేతులు మీద నడుస్తున్నావు?
కొడుకు : నువ్వేగా నాన్నా! టెన్త్ ఫెయిలైతే ఇంట్లో కాలు పెట్టొద్దన్నావు.

బరువు తగ్గే ఆట

రోగి : బరువు తగ్గాలంటే ఆటలు బాగా ఆడమన్నారుకదా అని పదిరోజులు ఒకటేపనిగా ఆడానండీ. అయినా బరువు తగ్గలేదే!
డాక్టర్ : ఇంతకీ మీరు ఏమేం ఆటలు ఆడారేంటి!
రోగి : క్యారమ్స్, చెస్, పేక.

వేలిముద్రలు

దొంగ : నేను దొంగతనం చేయలేదు సార్.
జడ్జి : మరి అక్కడ నీ వేలిముద్రలు ఎందుకున్నాయి?
దొంగ : అది జరగని పని. ఎందుకంటే అప్పుడు నేను గ్లోవ్స్ వేసుకున్నాను.

జోక్స్ పంపాల్సిన మా చిరునామా : నవ్వుల్ పువ్వుల్ శీర్షికకు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.

స్ఫూర్తి

ఎ గాంధి
సంపాదకుడు,
పీకాక్ క్లాసిక్స్

యువమేధ మెరుపు జీవితానికే మలుపు

'మీకు స్ఫూర్తినిచ్చిన ఒక పుస్తకం గురించి రాయండి' అని ప్రజాశక్తివారు అడిగి చాలా కాలమైంది. నేను చదివినవాటిలో ఏ పుస్తకం నన్ను అత్యధికంగా ప్రభావితం చేసిందోనని అప్పటినుంచీ ఆలోచిస్తూనే ఉన్నాను. కాని నాకది ఇంతవరకూ దొరకలేదు. నన్ను ఉక్కిరిబిక్కిరి చేసినవీ, దిగ్భ్రాంతి పరిచినవీ, నన్నూ, నా ఆలోచననూ ప్రభావితం చేసినవీ అనేక పుస్తకాలున్నాయి. కాని వాటన్నిటిలోనూ ఒక పుస్తకాన్ని వేరు చేయలేకపోయాను. తెలుగు పుస్తకాల్లో నన్ను దిగ్భ్రాంతికి గురిచేసిన మొదటి పుస్తకం చలం 'మైదానం'. అప్పుడు నేను తొమ్మిదో తరగతిలో ఉన్నాననుకుంటాను. తర్వాత నా ఆలోచనలకు కొంత పరిణతిని జోడించిన పుస్తకం గురజాడవారి 'కన్యాశుల్కం'. మైదానం లాగానే ఇది కూడా 'హీరో-విలన్' కథ కాదు. ఇందులో ప్రధాన పాత్ర అయిన గిరీశం హీరో కాదు. వాడు మాటకారి. చమత్కారి. పచ్చి అవకాశవాది. నా మీద ప్రభావం కలిగించిన రచయితల్లో కొ.కు ఒకరు. కవిత్వానికి సంబంధించి నేను గొప్ప పాఠకుడిని కాను.

నన్ను అప్పట్లో ఊపేసిన ఒక పుస్తకం 'కమ్యూనిస్టు ప్రణాళిక' తెలుగులోనే చదివాను. కమ్యూనిస్టు పార్టీలతోగానీ, కమ్యూనిస్టు సిద్ధాంతంతోగానీ అప్పటికి నాకు బొత్తిగా సంబంధం లేదు. ఆ పుస్తకం ప్రాముఖ్యత నాకప్పుడు అర్థమైందని చెప్పలేను. కాని దాని వేగం, దాని కవితాత్మకత, ప్రపంచాన్ని సవాలు చేసే దాని ధీమా, దాని అచంచలమైన ఆత్మ విశ్వాసం, దాని తర్కశక్తీ నన్ను ముంచెత్తాయి. తర్వాత కాస్త కమ్యూనిస్టు స్పృహ పెరిగాక చదివిన పుస్తకాల్లో 'ఫ్రాన్సులో అంతర్యుద్ధం'(civil war in France)కి ప్రాధాన్యం ఉంది. ఇది పారిస్ కమ్యూన్‌ని విశ్లేషించిన పుస్తకం. ఒక విప్లవాన్ని ఎలా చూడాలో నేర్పే పుస్తకం అది. అప్పుడు దాన్ని చాలా కష్టపడి ఇంగ్లీషులోనే చదివాను. కష్టానికి వందరెట్లు ఫలితమిచ్చిన పుస్తకం అది. ఇక 'పెట్టుబడి' గ్రంథం గురించి చెప్పాల్సిందేముంటుంది? 'పెట్టుబడి' పాఠకులెవరైనా దానిని చదవక ముందూకీ, చదివిన తర్వాతకీ వారి అవగాహనా శక్తిలో కచ్చితంగా తేడా ఉంటుంది.

నా ఆలోచనలను తీవ్రంగా ప్రభావితం చేసిన పుస్తకాల్లో ఇవి కొన్ని. అయితే నా జీవితాన్ని మలుపుతిప్పిన రచన ఒకటుంది. అది పుస్తకం కాదు. ఐదారు పేజీల వ్యాసం. దాన్ని నేను సుమారు పాతికేళ్ల వయసప్పుడు చదివాను. దాని రచయిత పదిహేడేళ్ల కుర్రాడు. ఆ కుర్రాడి పేరు కార్ల్ మార్క్స్. జీవితంలో ఏ వృత్తిని స్వీకరించాలి, ఎందుకు స్వీకరించాలి అన్న ప్రశ్నను చాలా బలంగా నా ముందు నిలిపిన రచన అది.

ఆ వ్యాసం పేరు 'వృత్తిని ఎంచుకోవడంలో ఓ యువకుని ఆలోచనలు'(Reflexions of a young man on the choice of a profession). 'ఎవరైనా కేవలం తన కోసం తాను పని చేస్తే బహుశా ఒక పండితునిగా ఖ్యాతి పొందవచ్చు. ఒక మహర్షి కావచ్చు. మహాకవీ కావచ్చు. కాని మానవకళ్యాణం కోసం పనిచేస్తూ తనని తాను పరిపుష్టం చేసుకొనేవాడే ధన్యుడు' అని ఆ వయసులోనే స్పష్టంగా చెప్పాడు మార్క్స్. "మానవజాతి శ్రేయస్సు కోసం పనిచేయడానికి అనువైన వృత్తిని మనం స్వీకరించగలిగితే, ఏ బరువు బాధ్యతలూ మనల్ని వంచలేవు. అప్పుడు మన త్యాగం అందరి కోసం చేసిన త్యాగమవుతుంది. మన ఆనందం సంకుచితం కాదు. అది కూడా అందరిదీ అవుతుంది. మన కృషికి నిత్యత్వం అబ్బుతుంది. అప్పుడు ఉన్నత మానవుల వెచ్చటి కన్నీళ్లతో మన అస్థికలు తడిచి పునీతమవుతాయి" అని ముగిస్తాడు మార్క్స్. విశేషం ఏమంటే జీవితం తొలి అడుగులో తాను

ఈ వ్యాసం చదివేదాకా లక్ష్యాన్ని నిర్ణయించుకోవడంపైనా, వృత్తిని ఎంచుకోవడంపైనా నాకంత దృష్టి లేదు. నేనప్పుడు ఏలూరులో మూడేళ్లుగా ట్యుటోరియల్ కాలేజీ నడుపుతున్నాను. దానిని వదిలేసి భారత కమ్యూనిస్టు పార్టీలో హోల్‌టైమర్‌గా చేరాలని కోరిక ఉండేది. కాని ఒక్కటే ఇబ్బంది. పార్టీ ఇవ్వగలిగిన డబ్బులతో బతకడం కష్టం. అందుకని ఆ ఆలోచన వచ్చినప్పుడల్లా పక్కన పెట్టేస్తూ వచ్చా. ఈ వ్యాసం చదివాక దాదాపు వెంటనే నిర్ణయం తీసేసుకున్నాను. హోల్‌టైమర్‌గా చేరాలన్న నా నిర్ణయాన్ని ఇద్దరితో చర్చించాలి. ఒకటి మా అమ్మ. రెండోది పార్టీవాళ్లు. అప్పటికి పెళ్లి కాలేదు. నా ఆదాయంతోనే ఇల్లు గడుస్తోంది. మా అమ్మ మార్క్స్ ఊహించుకున్న దేవుడిలాంటి 'ప్రజాతంత్రవాది'. ఒక్క తేడా. నాకు ఆదాయం తక్కువొచ్చినా 'దేవుడి'కి పోయేదేమీలేదు. నేనిచ్చిన దానితోనే ఇల్లు గడపాల్సిన అమ్మ పరిస్థితి వేరు. అయినా 'నీ ఇష్టం బాబూ' అంది. పార్టీ వాళ్లూ నన్ను 'వచ్చేయ్' అన్నారు. ఆ నిర్ణయం నా జీవితాన్ని ఓ మలుపు తిప్పింది.

నమ్మిన ఈ సత్యాన్ని జీవితపర్యంతం ఆచరించాడాయన.

ఏదో తాత్కాలికమైన ఆకర్షణతోనో, వాంఛతోనో, క్షణికమైన ప్రేరణతోనో, తొందరపాటుతోనో, భ్రమలతోనో అటువంటి నిర్ణయాలు తీసుకోగూడదని మార్క్స్ హెచ్చరిస్తాడు. నీ వృత్తి ఏదైనా అది సమాజ సేవకు ఒక సాధనంగా పనికి వస్తుందా లేదా చూసుకో అంటాడు. మరొకరి దాసునిగా నువ్వు అటువంటి లక్ష్యాన్ని చేపట్టలేవంటాడు. సమాజంలో నీ స్థానం అత్యున్నతం కానక్కర్లేదు. మానవజాతి సంక్షేమానికి తోడ్పడే వృత్తి ఏదైనా ఉదాత్తమే అంటాడు. నువ్వు కోరుకున్న వృత్తిని చేపట్టడానికి నీకు కొన్ని అడ్డంకులు ఉండొచ్చు. నీ సామాజిక సంబంధాలూ, సమాజంలో నువ్వున్న స్థానమూ, నీ పుట్టుక నుంచి నీకు కొన్ని పరిమితుల్ని విధిస్తాయి. నీ శారీరక పరిస్థితి కూడా నిన్ను శాసించవచ్చు. నువ్వు ఎంచుకొన్న వృత్తికి తగిన ప్రజ్ఞ నీకున్నదా సరే. లేదంటే నీ అంత దురదృష్టవంతుడు మరొకరుండరంటాడు పదిహేడేళ్ళ మార్క్స్. నీ శారీరక పరిమితుల్ని అయినా కొంత దాటవచ్చు. కాని నీ ఉదాత్త లక్ష్యానికి అవసరమైన ప్రజ్ఞాపాటవాలు లేకుంటే అది నరకమంటాడు. నీకు లేని ప్రజ్ఞను నువ్వు ఊహించుకుంటే అది పొరపాటు. ఆ పొరపాటు జరిగిందా, అది నీమీద ప్రతీకారం తీర్చుకుంటుంది. బయటివాళ్ళు నిన్ను ఎత్తి చూపకపోయినా నీ ఆత్మే నిన్ను వేధిస్తుందంటాడు.

ఈ పరిమితులన్నిటినీ దాటి మనం ఇష్టపడిన వృత్తిని స్వీకరించగలితే మనం సంపూర్ణంగా సత్యమని నమ్మిన భావాలకు అనుగుణమైన వృత్తినే ఎంచుకోవాలి. ఒక వృత్తి ధగధగ మెరుస్తోందనో, జీవితంలో అత్యధిక అవకాశాలను అందిస్తోందనో స్వీకరించరాదు. సమాజాన్ని ఉన్నతంగా మార్చడానికీ, నిన్ను నువ్వు ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడానికీ నీకు అనువైన వృత్తినే స్వీకరించాలి. అందునా నీ శక్తి స్తోమతులు అందుకు తగిన స్థాయిలో ఉన్నాయో లేవో చూసుకుని మరీ తీసుకోవాలంటాడు. 'నీ ఎంపిక సరిగా లేకపోతే అది నిన్ను సర్వనాశనం చేస్తుంది సుమా!' అంటాడు.

"జంతువు విషయంలో ప్రకృతే దాని పరిధిని నిర్ణయిస్తుంది. ఆ పరిధిలో జంతువు మారు మాటాడకుండా, వేరే ఆలోచన పెట్టుకోకుండా ఆనందంగా తిరుగుతుంది. కాని మనిషి సంగతి వేరు. దేవుడు మనిషికీ ఒక లక్ష్యం ఇస్తాడు. ప్రతి మనిషీ మానవజాతి ఔన్నత్యం కోసం కృషి చేయాలి. తనని తాను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలి. అదే లక్ష్యం. అయితే ఆ లక్ష్యాన్ని సాధించడానికి ఏ సాధనం ఎంచుకోవాలన్నది ఎవరి ఇష్టం వారిది. తనకి అనువైన సాధనాలు ఎంచుకునే స్వేచ్ఛ ప్రతి వ్యక్తికీ ఉంది. ఇది కేవలం మనిషికి మాత్రమే ఉన్న ప్రత్యేక హక్కు. దానికి దేవుడు అడ్డుపడడు అంటాడు మార్క్స్. ఆ వయసులో మార్క్స్ దేవుడిని నమ్మాడు. ఆవేళ్టికి మార్క్స్ నమ్మిన దేవుడు ఒక 'ప్రజాతంత్రవాది' అనిపిస్తుంది. అతడు శిక్షించేవాడో, రక్షించేవాడో కాదు. అంతకంటే ఉన్నతుడు. అతడు మార్గదర్శిగా ఉంటాడు తప్ప నియంత్రించడు. సున్నితంగా సూచిస్తాడు తప్ప నిర్దేశించడు. సాధనం సరిగా ఎంచుకునే బాధ్యత మనిషిదే. ఎంచుకోవడంలో తప్పొప్పులకూ, పర్యవసానాలకూ బాధ్యత కూడా మనిషిదే. అది మనిషి హక్కు.. అదే మనిషి బాధ్యత" ఇదీ క్లుప్తంగా మార్క్స్ రాసిన వ్యాసం సారాంశం.

ఈ వ్యాసం చదివేదాకా లక్ష్యాన్ని నిర్ణయించుకోవడంపైనా, వృత్తిని ఎంచుకోవడంపైనా నాకంత దృష్టి లేదు. నేనప్పుడు ఏలూరులో మూడేళ్లుగా ట్యుటోరియల్ కాలేజీ నడుపుతున్నాను. దానిని వదిలేసి భారత కమ్యూనిస్టు పార్టీలో హోల్‌టైమర్‌గా చేరాలని కోరిక ఉండేది. కాని ఒక్కటే ఇబ్బంది: పార్టీ ఇవ్వగలిగిన డబ్బులతో బతకడం కష్టం. అందుకని ఆ ఆలోచన వచ్చినప్పుడల్లా పక్కన పెట్టేస్తూ వచ్చా. ఈ వ్యాసం చదివాక దాదాపు వెంటనే నిర్ణయం తీసేసుకున్నాను. హోల్‌టైమర్‌గా చేరాలన్న నా నిర్ణయాన్ని ఇద్దరితో చర్చించాలి. ఒకటి, మా అమ్మ. రెండోది, పార్టీవాళ్లు. అప్పటికి పెళ్లి కాలేదు. నా ఆదాయంతోనే ఇల్లు గడుస్తోంది. మా అమ్మ మార్క్స్ ఊహించుకున్న దేవుడిలాంటి 'ప్రజాతంత్రవవాది'. ఒక్క తేడా. నాకు ఆదాయం తక్కువొచ్చినా 'దేవుడి'కి పోయేదేమీలేదు. నేనిచ్చిన దానితోనే ఇల్లు గడపాల్సిన అమ్మ పరిస్థితి వేరు. అయినా 'నీ ఇష్టం బాబూ' అంది. పార్టీ వాళ్లూ నన్ను సాదరంగానే 'వచ్చేయ్' అన్నారు. ఆ నిర్ణయం నా జీవితాన్ని ఓ మలుపు తిప్పింది. ఆ తర్వాత ఎప్పటికప్పుడు నా 'పని'ని ఎంచుకోవడంలో తప్పులూ ఉన్నాయి, ఒప్పులూ ఉన్నాయి. కాని నా లక్ష్యానికి మాత్రం ఢోకాలేదు. అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ.

పాఠశాల విద్య పూర్తిచేసుకుని బయటకు వెళ్లే విద్యార్థులు భవిష్యత్తులో ఎంచుకోబోయే వృత్తి గురించి ఓ వ్యాసం రాయడం ఆనాటి వారి ఆనవాయితీ. ఆ వ్యాసంలో అప్పుడే యవ్వనంలో అడుగుబెట్టబోతున్న మార్క్స్, సమస్యని అన్ని కోణాలనుంచి, అంత లోతుగా, అంత ఉదాత్తంగా ఎలా చూడగలిగాడా అని నాకు ఇప్పటికీ ఆశ్చర్యంగానే ఉంటుంది.

★

నా ఆలోచనలను తీవ్రంగా ప్రభావితం చేసిన పుస్తకాల్లో ఇవి కొన్ని. అయితే జీవితాన్ని మలుపుతిప్పిన రచన ఒకటుంది. అది పుస్తకం కాదు. ఐదారు పేజీల వ్యాసం. దాన్ని నేను సుమారు పాతికేళ్ల వయసప్పుడు చదివాను. దాని రచయిత పదిహేడేళ్ల కుర్రాడు. ఆ కుర్రాడి పేరు కార్ల్ మార్క్స్. జీవితంలో ఏ వృత్తిని స్వీకరించాలి, ఎందుకు స్వీకరించాలి అన్న ప్రశ్నను చాలా బలంగా నా ముందు నిలిపిన రచన అది. ఆ వ్యాసం పేరు 'వృత్తిని ఎంచుకోవడంలో ఓ యువకుని ఆలోచనలు'(Reflexions of a young man on the choice of a profession). 'ఎవరైనా కేవలం తన కోసం తాను పని చేస్తే బహుశా ఒక పండితునిగా ఖ్యాతి పొందవచ్చు. ఒక మహర్షి కావచ్చు. మహాకవీ కావచ్చు. కాని మానవకళ్యాణం కోసం పనిచేస్తూ తనని తాను పరిపుష్టం చేసుకొనేవాడే ధన్యుడు' అని ఆ వయసులోనే స్పష్టంగా చెప్పాడు మార్క్స్.



మటన్ బిర్యానీ

కావలసిన వస్తువులు

బియ్యం - 1కిలో, మటన్ - 1కిలో, పెరుగు - పావులీటర్, డాల్డా - 150గ్రా॥,
నిమ్మకాయలు - 2, పచ్చిమిర్చి - 10, కారం - 1స్పూను,
ఉప్పు -తగినంత, కొత్తిమీర - 1కట్ట, పుదీనా - 1కట్ట, అల్లం వెల్లుల్లి పేస్ట్ - 3
టేబుల్ స్పూన్లు, ఉల్లిగడ్డలు - పావుకిలో (4పెద్దవి), లవంగాలు - 6,
యాలకులు - 4, దాల్చిన చెక్క - కొంచెం, షాజీర - టీ స్పూను

తయారు చేసే విధానం

డాల్డాలో ఉల్లిపాయ ముక్కలు దోరగా వేయించి విడిగా పెట్టుకోవాలి. మటన్ కడిగి పెద్ద గిన్నెలో వేసి దానికి పుదీనా, కొత్తిమీర, అల్లం వెల్లుల్లి పేస్ట్, వేయించిన ఉల్లిగడ్డముక్కలు సగం, ఉప్పు, కారం, పచ్చిమిర్చి ముక్కలు, 1 నిమ్మకాయ రసం, పెరుగు, లవంగాలు, యాలుకలు, దాల్చిన చెక్క, షాజీర, డాల్డా కూడా కొంచెం కలిపి ఒక గంట అలాగే వుంచాలి. తర్వాత బియ్యం సగం ఉడికాక (అంటే అన్నం పలుకుగా వుండాలి) నీళ్లు మొత్తం వొంపేయాలి. ఆ బియ్యాన్ని దినుసులన్నీ కలిపి వుంచిన మటన్ పైన వేయాలి. మిగిలిన డాల్డా, కొంచెం కొత్తిమీర, పుదీనా ఆకులు, వేపిన ఉల్లిపాయ ముక్కలు, నిమ్మకాయ రసం కూడా బియ్యం పైన వేసి పది నిమిషాలు ఉడకనివ్వాలి. తర్వాత సన్న సెగ మీద మరో పదినిమిషాలు ఉంచితే చాలు. ఉడికేటప్పుడు ఆవిరి పోకుండా చూసుకోవాలి. అంతే ఘుమఘుమలాడే మటన్ బిర్యానీ రెడీ. తినేముందు మటన్ అన్నం మొత్తం కలిసేలా కలియదిప్పాలి.

టమాటా మసాలా

కావలసిన వస్తువులు

టమాటాలు - పావుకిలో, చింతపండు - 100గ్రా॥, నువ్వులు - 50గ్రా॥,
కొబ్బరి - 1 చిప్ప, పల్లీలు - 50 గ్రా॥, జీలకర్ర - 2టీ స్పూన్లు,
మెంతులు - టీ స్పూను, ఉల్లిగడ్డ - 2 పెద్దవి, కారం - 2 స్పూన్లు,
ఉప్పు - తగినంత, పసుపు - చిటికెడు, నూనె - 50 గ్రా॥
అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 టేబుల్ స్పూను

తయారుచేసే పద్ధతి

జిలకర, నువ్వులు, పల్లీలు, మెంతులు వేయించుకొని పొడి చేసుకోవాలి. అందులో అల్లం వెల్లుల్లి పేస్ట్, ఉప్పు, కారం వేసి మెత్తగా రుబ్బుకోవాలి. టమాటాలను గుత్తి వంకాయ లాగా 4 ముక్కలు కోసి కొద్ది నూనెలో వేయించి తీయాలి. తాలింపు వేసుకొని నూరి ఉంచిన పేస్ట్ అంతా పచ్చి వాసన పోయేలా వేయించాలి. అందులో చింతపండు రసం పోసి చిక్కగా అయ్యే వరకు ఉడకనివ్వాలి. దింపేముందు వేయించిన టమాటాలను వేయాలి. బిర్యానీలో తింటే బావుంటుంది.



-అలియా తబస్సుమ్

షీర్‌ఖుర్మా

కావలసిన పదార్థాలు

పాలు -1 లీటర్, పంచదార - పావుకిలో
సేమ్యా - 100 గ్రాములు, నెయ్యి - 100 గ్రాములు
జీడిపప్పు - 25 గ్రాములు, బాదంపప్పులు - 25 గ్రాములు
పిస్తా - 25 గ్రాములు, కిస్‌మిస్ - 25 గ్రాములు
సారపప్పు - 25 గ్రాములు, మిల్క్‌మెయిడ్ లేదా కోవా - 2 టీస్పూన్లు
ఎండు ఖర్జూర - 25 గ్రాములు, యాలకులు - 8
కర్బూజా గింజలు - 25 గ్రాములు

తయారు చేసే విధానం

సేమ్యాను నేతిలో దోరగా వేయించుకోవాలి. జీడిపప్పు, బాదం, పిస్తా, సారపప్పు, కర్బూజా గింజలు నేతిలో వేయించుకోవాలి. పాలు కాగపెట్టుకొని అందులో పంచదార వేసి మరికొద్ది సేపు పాలు కాగనివ్వాలి. అందులో వేయించిన సేమ్యా వేసి ఐదు నిమిషాలు ఉడికించాలి. పొయ్యిమీద నుండి దింపి వేయించి పెట్టుకున్న జీడిపప్పు, బాదం పప్పు.... అన్నీ అందులో వేస్తే సరి. రుచికరమైన షీర్‌ఖుర్మా రెడీ

సొరకాయ ఖీర్

కావలసిన పదార్థాలు

సొరకాయ - 1 చిన్నది
పాలు -1 లీటరు
పంచదార - పావుకిలో
సగ్గుబియ్యం - పావుకిలో
కోవా - 100గ్రాములు
యాలకులు - 8.

తయారు చేసే విధానం

సొరకాయ చెక్కుతీసి గింజలు లేకుండా తురుముకొని ఉడకబెట్టుకోవాలి. సగ్గుబియ్యాన్ని కూడా ఉడకబెట్టాలి. పాలు కాచి ఉడకబెట్టిన సొరకాయ, సగ్గుబియ్యాన్ని అందులో వేసి కలపాలి. పంచదారను కూడా వేసి బాగా కలియబెట్టాలి. దింపేముందు కోవా, యాలకుల పొడి వేసి కలుపుకోవాలి.

★



అరుణారుణ ఛాయల్లో... శాంతి... సౌభాగ్యం...

- ఎస్.వినయకుమార్

వరంగ్ పారా అనే ఆదివాసీ గ్రామం పచ్చని గుట్టల మధ్య తీర్చిదిద్దినట్లు కన్పించింది. ఆ గ్రామంలో 65 ఇళ్లున్నాయి. కొండ పైనుండి మాకు గ్రామమంతా కన్పించింది. గ్రామం వెలుపల ఒక పాఠశాల. ఇతర గ్రామాల నుండి ఆ స్కూల్‌కు వచ్చే విద్యార్థులెవరూ లేరు. 65 ఇళ్ళ కోసమే ఒక పాఠశాల ఉండటం మనకు ఆశ్చర్యం కల్గించే విషయమే. ఆ గ్రామం ఏర్పడి 25 ఏళ్లు అయింది. పోడు వ్యవసాయం చేసుకొంటూ ఒక చోట స్థిరంగా ఉండని ఆదివాసీలు 25 ఏళ్లనుండి ఆ గ్రామంలోనే ఉంటున్నారు. కొండ పైనుండి గ్రామంలో నాలుగు ఇళ్ళపై మాకు టీవీ యాంటీనాలు కన్పించాయి. ప్రభుత్వం ఆ గ్రామం గిరిజనులకు భూములు కేటాయించింది. దానివల్ల కుదురుగా ఒక చోట నివసించే అవకాశం వారికి కల్గింది. పున్నతి రియాంగ్‌తో పాటు ఆమె భర్త మహేంద్ర రియాంగ్ మాతో మాట్లాడుతూ తమకు ఏనుగుల బెడద తప్ప ఇతర సమస్యల్లేవన్నారు. ఏనుగులు బెడదను తప్పించాలని కోరారు.

అమర్‌పూర్

ఉదయ్‌పూర్ జిల్లాలో అమర్‌పూర్ ఒక సబ్‌డివిజన్. అక్కడి బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారి ప్రసూన్‌డే మమ్మల్ని కొన్ని గ్రామాలకు తీసుకెళ్ళారు. అమర్‌పూర్ బ్లాక్ జనాభా 55వేలు. అక్కడి పాఠశాలల సంఖ్య 84, రెండు కళాశాలలు, ఒక ఐటీఐ, రెండు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు వున్నాయి. అక్షరాస్యత 80 శాతం పైనే ఉంటుందని ఆయన చెప్పారు. బ్లాక్‌లో సేద్య యోగమైన భూమి 8094 హెక్టార్లు కాగా, 7 వేల హెక్టార్లలో సాగు చేస్తున్నారన్నారు. ఈ బ్లాకు గుండా గోమతినది (లక్నోలో కూడా గోమతినది ఉంటుంది. అదివేరు) పారుతుంది. దానిమీద బ్లాకు పరిధిలో 68 లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, ఇతర వాగులపై మరో ఏడు ఉన్నాయి. వీటిని ప్రభుత్వమే నిర్వహిస్తుంది.

అమర్‌పూర్‌కు సమీపంలోని రాంగ్‌కాంగ్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న ఒక చెరువు నిర్మాణాన్ని మేము సందర్శించాం. 288 కుటుంబాలకు చెందిన 325 మంది స్త్రీపురుషులు ఆ నిర్మాణంలో పాల్గొంటున్నారు. గత ఏడాది అక్కర ఉపాధిహామీ పథకం కింద వందరోజుల పని లభించింది. ఈ ఏడాది ఇప్పటికే 31 రోజుల పని లభించింది. మూడేళ్ల కాలంలో అక్కడ కూలీరేటు రు.60 నుండి 100 కు పెరిగింది. అర్చన మోందీ అనే మహిళ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో ఇప్పుడు రు.100 కూలీగా ఇస్తున్నందువల్ల వ్యవసాయ పనుల్లో కూడా తమ కూలీ రేటు పెరిగిందన్నారు. తమకు ఏడాది పొడుగునా ఏదో ఒక పని లభిస్తుందని పస్తులుండాల్సిన పరిస్థితి తమకు ఎప్పుడూ కలుగలేదన్నారు. నిర్మాణం తర్వాత ఆ చెరువులో సెల్ఫ్‌హెల్ప్‌గ్రూప్ అధ్వర్యంలో చేపలు పెంచుతారు. వచ్చే ఆదాయంలో కొంతభాగం మొదట కొన్నేళ్ళపాటు గ్రామపంచాయతీ తీసుకొంటుంది. తర్వాత మొత్తం ఆదాయాన్ని సెల్ఫ్‌హెల్ప్ గ్రూపుకే వదిలిపెడ్తుంది. ఉపాధిహామీ పథకం కింద చేపడ్తున్న అనేక పనుల్లో ఇదే పద్ధతిని ప్రభుత్వం అనుసరిస్తోందని డే చెప్పారు. త్రిపుర రాష్ట్రంలో ఆత్మహత్య ఎక్కడా కన్పించదని ఆయన అన్నారు. గతంలో ఎక్కువ మంది ఆదివాసీ మహిళలు ఇళ్ల దగ్గరే ప్రసవించేవారు. ఇప్పుడు పరిస్థితి క్రమంగా మారుతోంది. జనని సురక్ష యోజన కింద బిపిఎల్ కుటుంబాలకు ఇంటి దగ్గర ప్రసవానికి రు.500, ఆస్పత్రుల్లో ప్రసవానికి రు. 700 చెల్లిస్తున్నామని, కాన్పుల కోసం ఆస్పత్రులకు వచ్చేట్లుగా తాము ప్రజలను ప్రోత్సహిస్తున్నామని డే చెప్పారు.

ఉపాధి హామీ పథక అమల్లో త్రిపురది అగ్రస్థానం. వందరోజుల లక్ష్యాన్ని అందుకున్న గ్రామాలెన్నో ఉన్నాయక్కడ. అమర్‌పూర్ బ్లాకులోని రంగ్‌కాంగ్ గ్రామపంచాయితీలో ఉపాధి హామీ పథకంలో ఒక చిన్న సైజ్ చెరువు నిర్మాణం జరుగుతోంది. నిర్మాణ స్థలాన్ని సందర్శించాను. 288 కుటుంబాలకు చెందిన 325 మంది స్త్రీ, పురుషులు అక్కడ పనిచేస్తున్నారు. గత ఏడాది అక్కడ వందరోజుల లక్ష్యం సాధించారు. రోజుకు వంద రూపాయల వేతనం లభిస్తోంది. ఈ చెరువువల్ల సాగునీరు లభిస్తుంది. చెరువులో చేపలను పెంచుతారు.

ఖేదార్‌నల్ అనే మరోగ్రామాన్ని సందర్శించాం. అక్కడ కూడా గ్రామంలోని కూలీలందరికీ గత ఏడాది వంద రోజుల కూలీ లభించింది. ఉపాధి హామీ పథకం కింద 2007-08 సంవత్సరంలో ఆప్రాంతంలోని గ్రామాలన్నింటికీ ఇటుక రోడ్లు వేసి ప్రధాన రహదారితో కలిపారు. కేవలం రోడ్లేకాదు ఇళ్లపై ఆర్‌సిసి రూఫ్‌లకు, వంతెన నిర్మాణానికి కూడా ఇటుక చిప్స్ వాడుతారు. మన దగ్గర రాళ్ల చిప్స్ (కంకర) కుప్పలు కన్పించినట్టు రోడ్లపై అక్కడక్కడా ఇటుక చిప్స్ కన్పిస్తాయి. అక్కడి ఇటుకలు అంత బలంగా ఉంటాయన్నమాట. ఆ గ్రామాన్ని మేము సందర్శించినప్పుడు ఉపాధి హామీ కింద 30 ఎకరాల్లో నిమ్మతోట వేస్తున్నారు.

ఎకరాకు 600 చెట్లు నాటుతున్నట్లు అక్కడి కూలీలు చెప్పారు. గ్రామంలో అతి పేదవారిని గ్రామ సభ ద్వారా ఎన్నుకొని వారికి ఈ పని అప్పగించారు. ఈ నిమ్మతోటను కొంతకాలం పాటు ప్రభుత్వ ఖర్చుతో నిర్వహించి, ఆ తర్వాత లబ్దిదారులకు అప్పగిస్తారు. పంట అంతా లబ్దిదారులకు దక్కుతుంది. పంటను మార్కెట్టుకు తీసుకెళ్లడానికి లబ్దిదారులు ఇప్పటికే ఒక సహకార సొసైటీని ఏర్పాటు చేసుకొన్నారు.

మాజీ మిలిటెంట్ మోహన్ రియాంగ్

తీవ్రవాద దళాల్లో పనిచేసి, ఆమార్గాన్ని వదిలిపెట్టి జనజీవన స్రవంతిలో కలిసిన అనేకమందిలో మోహన్ రియాంగ్ ఒకరు. ప్రస్తుతం ఆయన ఖేదార్‌నల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి. నిమ్మతోట పనిని ఆయనే పర్యవేక్షిస్తున్నారు. నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర'లో సెకండ్ లెఫ్టినెంట్‌గా పనిచేశాడు. అనేక ప్రత్యక్ష చర్యల్లో పాల్గొని అతి ప్రమాదకరమైన ఉగ్రవాదిగా పేరుపడ్డాడు. అతని తలకు ప్రభుత్వం వెల నిర్ణయించింది. హత్యాకాండతో తమ ప్రజలను తామే చంపేయడం నచ్చక తాను ఉగ్రవాద సంస్థనుండి బయటకి వచ్చినట్లు ఆయన చెప్పారు. పదవ తరగతి పాసైన అతనికి ప్రభుత్వం చేయూత నిచ్చింది. గ్రామ పంచాయతీ కార్యదర్శిగా నియమించింది. బయటికి వచ్చాక ఇద్దరు పిల్లల వితంతువును పెళ్లాడాడు. ఇప్పుడు మరో అబ్బాయి. "నా జీవితం హాయిగా ఉండడమే కాదు, నా వారికోసం పనిచేస్తున్నానన్న సంతృప్తి ఉంది" అని అతను చెప్పాడు.

అగర్‌బత్తీలు జీవితాన్ని మార్చేశాయి

ఖేదార్‌నల్ గ్రామంలో కొన్ని కుటుంబాల పరిస్థితిని అగర్‌బత్తీలు మార్చాయి. అగర్‌బత్తీలకు అవసరమైన పుల్లలను ఒక రకమైన వెదురునుండి తీస్తారు. అలాంటి ఒక ఇంటిని నేను సందర్శించాను. ఇంటి యజమాని పేరు సుఖీరాం త్రిపుర. 19 ఆదివాసీల్లో త్రిపుర ఒక తెగ. ఆమె ఇంట్లో రెండు డబుల్ కాట్ మంచాలు, రెండు ఫ్యాన్లు, గోడ గడియారం, టీవీ, చెక్క బీరువా వంటి సదుపాయాలున్నాయి.

సోలార్ పవర్ ద్వారా ఆ ఇంటికి కరెంట్ సరఫరా అవుతుంది. అగర్‌బత్తీ పుల్లలను బెంగుళూరుకు పంపిస్తామని సుఖీరాం చెప్పింది. వంటగది కోసం మరో గుడిసె ఉంది. అందులో లంగీ(మద్యం) తయారీ కోసం వండిన అన్నాన్ని పులియబెడుతున్నారు. పులిసిన అన్నంలో అక్కడ లభించే ఒక చెట్టు ఆకులతో, తౌడుతో తయారు చేసి ఎండబెట్టిన ఉండలను కలిపి ఉడకబెడ్తారు. డిస్టిల్ ప్రక్రియతో లంగీని తయారు చేస్తారు. మూడుకిలోల బియ్యం నుండి నాలుగు లీటర్ల లంగీ లభిస్తుందట. మారుమూల ఆదివాసీ పల్లెలో సోలార్ పవర్ వినియోగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. ఇంటి యజమానులు 500 రూపాయలు చెల్లిస్తే సబ్సిడీపై బ్యాటరీలు, సోలార్ ప్లేటు, ఇతర అవసరమైన పరికరాలను ప్రభుత్వం అందచేస్తుంది. అగర్‌బత్తీల పుల్లల వల్ల తమకు మంచి ఆదాయం వస్తున్నట్లు సుఖీరాం చెప్పింది.

చిన్న సైజ్ ఆవులు

త్రిపురలో ఆవులు చిన్నసైజ్‌లో ఉంటాయి. పాల ఉత్పత్తి కూడా తక్కువ. 5 లీటర్ల వరకు మాత్రమే పాలిస్తాయని అమర్‌పూర్ బి.డి.ఓ ప్రసూన్ చెప్పారు. అయితే ఈ పశువులకు చాకిరీ తక్కువ. మేలుజాతి పశువులను పెంచాలంటే వాటికి చాకిరీ ఎక్కువ. అంత చాకిరీ చేయడానికి ఆదివాసీలు సంసిద్ధులు కావడం లేదని అంటారు. విస్తారంగా మేత అందుబాటులో ఉన్నప్పటికీ అక్కడ చూసిన చిన్నసైజులో వుండే బ్లాక్ బెంగాల్‌గోట్(మేక) మాత్రమే కన్పిస్తుంది. గొర్రెలు, మేలు జాతి మేకలు కన్పించవు. పశుగణాభివృద్ధి విషయంలో త్రిపురకు ఇంకా అపార అవకాశాలున్నాయనిపిస్తుంది.

దర్శనీయ స్థలం అగర్తల రైల్వేస్టేషన్

త్రిపురలో ఉన్న ఐదురోజుల్లో మూడుసార్లు నన్ను అగర్తల రైల్వేస్టేషన్‌కు తీసుకెళ్లారు. అగర్తలలో అదొక దర్శనీయ స్థలమైంది. అవునుమరి సుదీర్ఘపోరాటం తర్వాత సాధించుకొన్నదాయె. స్వాతంత్ర్యం ఏర్పడిన దగ్గర నుండి త్రిపుర వాసులు రైలు మార్గం కోసం పోరాడుతున్నారు. గత ఏడాది మాత్రమే రైలుమార్గం ప్రారంభమైంది. కేంద్ర ప్రభుత్వానికి తగిన శ్రద్ధలేక కొంత, ఉగ్రవాదుల విధ్వంసకాండతో ఎదురైన ఆటంకాల వల్ల కొంత.. మొత్తానికి త్రిపురకు రైలు రావడానికి 60ఏళ్లు పట్టింది. రైలు మార్గం ద్వారా అగర్తలను అస్సాం రాజధాని గౌహతితో అనుసంధించారు. అయితే రైలు ఎప్పుడు నడుస్తుందో ఎప్పుడు రద్దవుతుందో ఎవరూ చెప్పలేరు. అస్సాం భూభాగంలో ఇప్పటికీ కొనసాగుతున్న విధ్వంసకాండే దానికి కారణం. ఉగ్రవాదాన్ని త్రిపుర ప్రభుత్వం చాలా వరకు జయించగల్గింది. అస్సాంలో ఆ పరిస్థితి లేదు. రైలు నడిచినా నడవకపోయినా స్టేషన్‌మాత్రం ఎప్పుడూ పరిశుభ్రంగా వుంచుతుంటారు. అపురూపంగా చూసుకుంటారు. అగర్తలకు 15 కిలోమీటర్ల దూరంలోనే రైలుమార్గం వుంది. అయితే దేశ విభజనలో రైలుమార్గమంతా బంగ్లాదేశ్‌లోకి వెళ్లిపోయింది.

పూర్తికావస్తున్న ఫెన్సింగ్

బంగ్లాదేశ్ సరిహద్దు త్రిపురకు ఒక వ్రణం లాంటిదే. సుదీర్ఘకాలం పాటు సాగిన వివిధ ఉగ్రవాద దుశ్చర్యలకు బంగ్లాదేశ్ భూభాగం నుండి పూర్తి సహాయ సహకారాలు అందాయి. వారు ఉపయోగించిన ఆయుధాలు బంగ్లాదేశ్ గుండా వచ్చినవే. తాము పట్టుకొన్న ఉగ్రవాదుల్లో కొందరికి ఆఫ్ఘనిస్తాన్‌లో శిక్షణ ఇచ్చినట్లు తెలిసి తాము అప్పట్లో అవాక్కయ్యామని ఎస్పీ శ్రీనివాసరావు చెప్పారు. రాజకీయ అవకాశవాదంతో కాంగ్రెస్ పార్టీకూడా ఉగ్రవాదులతో దాగుడుమూతలాడింది. పలు సందర్భాల్లో వారికి మద్దతునిచ్చింది. బంగ్లాదేశ్ నుండి తరలి వచ్చే శరణార్థులు త్రిపురకు నిరంతర సమస్యే. సరిహద్దు గ్రామాల్లోకి బంగ్లాదేశీయులు ప్రవేశించడం, దొంగచాటుగా పశువులను తోలుకెళ్లడం గతంలో ఎక్కువగా జరిగేది. రెండు దేశాల మధ్య ఫెన్సింగ్ దాదాపు పూర్తి కావస్తోంది. కనుక తమ సమస్యలు కాస్త తగ్గుతాయని త్రిపుర వాసులు ఆశాభావంతో ఉన్నారు.

అగర్తలలో ఆధునిక నిర్మాణాలు

అగర్తల పట్టణంలో ప్రస్తుతం అనేక ఆధునిక భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. వచ్చే ఏడాది అగర్తల వెళ్లేవారికి ఓ కొత్త పట్టణం దర్శనమిస్తుంది. పట్టణం సరిహద్దుల్లో నూతన అసెంబ్లీ భవనం దాని


జీవితాన్నే మార్చేసిన అగర్‌బత్తీలు...


బీర్ చంద్రమాను ఊచకోతకు సజీవ సాక్షి

ఎదురుగా నూతన సచివాలయ భవనం ఆధునిక వసతులతో నిర్మిస్తున్నారు. తుది మెరుగులు మినహాయించి నిర్మాణం దాదాపు పూర్తయిన ఈ భవనాలు ఎంతో ఆకర్షణీయంగా కన్పిస్తున్నాయి. ప్రస్తుతం అసెంబ్లీ కోసం మహారాజు గారి రాజభవనాన్ని ఉపయోగిస్తున్నారు. త్రిపురలో హైకోర్టు లేదు. కోర్టు కోసం గౌహతి వెళ్లాలి. కేంద్ర ప్రభుత్వం ఇంకా అనుమతినివ్వనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి హైకోర్టు కోసం పూర్తి హంగులతో ఒక పెద్ద భవనం నిర్మిస్తోంది. 'భవనం నిర్మిస్తున్నారు సరే! కేంద్రం హైకోర్టును మంజూరు చేస్తుందని విశ్వసిస్తున్నారా?' అన్న ప్రశ్నకు త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ సమాధానమిస్తూ పూర్తి నమ్మకం ఉందని, ప్రస్తుత న్యాయశాఖామంత్రి భరద్వాజ్ చాలా చురుగ్గా నిర్ణయాలు చేసే వ్యక్తని అన్నారు. అలాగే వైద్య కళాశాలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాలను నిర్మిస్తున్నారు. త్రిపుర ప్రభుత్వం తన ఖర్చులతో ఆంధ్రప్రదేశ్‌లాంటి సుదూర ప్రాంతాలకు నర్సింగ్ శిక్షణ కోసం యువతులను పంపిస్తోంది. వ్యవసాయ యూనివర్సిటీ భవనం, చేపల పరిశోధన, తదితర పరిశోధనల కోసం మరిన్ని భవనాల నిర్మాణం జోరుగా సాగుతోంది. సంగీత సాహిత్యాలంటే త్రిపుర ప్రజలు చెవికోసుకుంటారు. బాలికలకు నృత్యం నేర్పడం పట్ల బెంగాలీ కుటుంబాలకు చాలా ఆసక్తి. నృత్యం చేయడం చిన్నతనంగా, ఎవరో కొందరు మాత్రమే చేయవల్సిన పనిగా వారు భావించరు. అలాగే గాత్ర సంగీతం, వాద్య సంగీతంలో ప్రవేశం ఉన్న వారు చాలా ఎక్కువ. అయితే విచిత్రమేమిటంటే అగర్తలలో ఒక్క సినిమా థియేటర్ కూడా లేదు. పురాతన కాలంలో పట్టణంలో నాలుగు థియేటర్లు ఉండేవట. శిథిలావస్థకు చేరుకున్న తరువాత కొన్నేళ్ల క్రితం ఆ సినిమా థియేటర్లను మూసేశారు. సినిమా థియేటర్ల నిర్మాణానికి ఎవరూ పూనుకోలేదు. అది ఒక లోపంగా అగర్తల వాసులు భావించకపోవడం గమనార్హం. నజ్రుల్ ఇస్లాం పేర నిర్మించిన విశాలమైన ఆడిటోరియం పట్టణం మధ్యలో ఉంది. అక్కడ తరచూ చిత్రకళా ప్రదర్శనలు, సాహితీ సభలు, సంగీత కచేరీలు జరుగుతుంటాయి. అప్పుడప్పుడూ అక్కడ ఫిలిం ఫెస్టివల్స్ నిర్వహించి ఎంపిక చేసిన సినిమాలను ప్రదర్శిస్తుంటారు. అగర్తల పట్టణంలో మరొక చెప్పుకోతగ్గ స్థలం ఓపెన్ ఎయిర్ క్రికెట్ స్టేడియం. రంజీ ట్రోఫీ ఇతర ట్రోఫీలు అక్కడ జరుగుతుంటాయి. బిసిసిఐ నిర్వహణ కింద ఉన్న ఈ స్టేడియంలో అంతర్జాతీయస్థాయి మ్యాచ్‌లు ఆడడానికి కూడా అనువైన పిచ్ ఉన్నప్పటికీ పట్టణంలో ఫైవ్‌స్టార్ హోటల్ లేదు కనుక ఇప్పటిదాకా అంతర్జాతీయ మ్యాచ్‌లు అక్కడ జరగలేదు. క్రికెట్‌లో శిక్షణకు ఆ స్టేడియంలో ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఏడాదికి రూ.25లక్షల ఫీజుపై ఒక మగకోచ్, ఏడాదికి రూ.3లక్షల ఫీజుపై ఒక మహిళా కోచ్ బిసిసిఐ ఆధ్వర్యంలో అక్కడ శిక్షణ ఇస్తున్నారు. క్రికెట్‌లో

మహిళలకు లభిస్తున్న ప్రోత్సాహం ఏపాటిదో దీన్ని బట్టి కూడా తెలుస్తుంది. అగర్తల స్టేడియంతో పాటు ఈశాన్య రాష్ట్రాల్లోని మరికొన్ని స్టేడియాలకు క్యూరేటర్‌గా పని చేస్తున్న ఆశిష్‌కుమార్ భౌమిక్ 'దేశోర్ కథ' పత్రికకు స్పోర్ట్స్ కాలమిస్ట్, ఫోటోగ్రాఫర్ కూడా.

పోరాటాలు - అశేష త్యాగాలు

త్రిపురలో వామపక్ష ప్రభుత్వం ఉనికిలోకి రావడానికి ముందు సిపిఎం తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొంది. కాంగ్రెస్ గూండాల చేతిలో, కాంగ్రెస్ మద్దతునిచ్చిన ఉగ్రవాద సంస్థలు సాగించిన హత్యాకాండలో ఎంతోమంది సిపిఎం కార్యకర్తలు బలయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో పర్యటిస్తున్నప్పుడు చాలాచోట్ల అమరజీవుల సమాధులు, స్మారక స్థూపాలు కన్పిస్తుంటాయి. 'ఇక్కడ ఇంతమందిని చంపారు. అక్కడ అంతమందిని చంపారు' అంటూ నాతో పాటు ప్రయాణించిన దేశరన్ విలేకరులు నాకు దారిపొడుగునా అనేక స్థలాలు చూపించారు. ఈ హత్యాకాండలో చాలా దారుణమైంది బీర్ చంద్రమాను అనే ప్రదేశంలో సాగిన ఊచకోత. 1988 అక్టోబర్ 12వ తేదీన గ్రామంలోని సిపిఎం కార్యాలయంపై కాంగ్రెస్ గూండాలు దాడిచేసి 11 మంది కామ్రేడ్స్, ఇద్దరు సెక్యూరిటీ గార్డులను ఒక చిన్నగదిలో నరికి చంపారు... సిపిఎం కార్యకర్తలు చేసిన నేరమల్లా ఆ ఆఫీసు ముందు ఎర్రజెండా ఎగురవేయడానికి ప్రయత్నించడమే. ఆ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ప్రజామోహన్ జమాతీయ పాల్గొన్నప్పటికీ కత్తులతో దాడి చేయాలని కాంగ్రెస్ గూండాలు నిర్ణయించుకున్నారు. ఈ విషయం తెలిసి స్థానిక సిపిఎం నాయకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చినప్పటికీ ప్రేక్షక పాత్ర వహించారు. సాయంత్రం 3.30 నుండి కాంగ్రెస్ వారు దాడులు ప్రారంభించారు. సిపిఎం కార్యకర్తలు తిప్పికొట్టారు. ఎక్కువ సంఖ్యలో వచ్చిన కాంగ్రెస్ వారు పోలీసుల మౌనాన్ని ఆసరాగా చేసుకుని 9.30 ప్రాంతంలో ఆఫీసు తలుపులు పగలకొట్టి లోపలికి ప్రవేశించారు. విచక్షణ లేకుండా దొరికిన వారినల్లా నరికి చంపారు. ఇద్దరు అంగరక్షకులు శాసనసభ్యుడు ప్రజామోహన్ జమాతీయను చీకట్లో వెనక ద్వారం గుండా అక్కడినుండి సురక్షితంగా బయటకు తీసుకెళ్లారు. ఇప్పుడు ప్రజామోహన్ వయస్సు 96 సంవత్సరాలు, సజీవంగా ఉన్నారు. ఆనాటి దాడులు హింసాకాండకు గుర్తుగా మట్టిగోడలతో ఉన్న ఆ ఆఫీసును అలాగే ఉంచి, దానిపై పెద్ద భవనం నిర్మించారు. పార్టీ కార్యాలయంతోపాటు సమావేశం నిర్వహించుకోవడానికి ఒక హాలు ఆ భవనంలో ఉన్నాయి. భవనం పక్కనే దాదాపు 30 అడుగుల స్మారకస్థూపం నిర్మించారు. అగర్తలకు కనీసం 80 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఆ స్థూపాన్ని దేశోర్‌కథ సంపాదకుడు గౌతందాస్ నాకు, తిక్కదీర్ ఎడిటర్ పరమేశ్వరన్‌కు చూపెట్టి నాటి కాంగ్రెస్ దుర్మార్గాన్ని వివరించారు. ఇంత భారీ సంఖ్యలో కాకపోయినా ఇలాంటి హింసాకాండలో సిపిఎం తన కార్యకర్తలనెందరినో కోల్పోయింది. సిపిఎం ఆధ్వర్యంలో సాగిన భూపోరాటాలను, పార్టీ అభివృద్ధిని అడ్డుకోవాలన్న కక్షతో ఇలాంటి ఆగడాలకు కాంగ్రెస్ పాల్పడింది. ఇంతటి తీవ్ర నిర్బంధకాండను సాగించినప్పటికీ ఆదివాసీలు, పేద-మధ్యతరగతి బెంగాలీలు సిపిఎం వెనుక నానాటికీ ఎక్కువ సంఖ్యలో సమీకృతులయ్యారు. కాంగ్రెస్‌ను, ఉగ్రవాదులను తిప్పికొట్టారు. ఎర్రజెండాను సమున్నతంగా నిలిపారు. శాంతిని సాధించారు. సౌభాగ్యం పెంచుకొంటున్నారు.

(సమాప్తం)

దేవ్‌బర్మన్ పేరు వెనుక కథ

త్రిపురలోని ఆదివాసుల్లో అత్యధికులు దేవ్‌బర్మా తెగకు సంబంధించినవారు. ఇతర ఆదివాసీల మాదిరిగా వీరు కూడా పొట్టిగానే ఉన్నప్పటికీ ఎక్కువగా సైన్యంలో పనిచేసేవారట. స్వాతంత్ర్యానికి ముందు బర్మాయుద్ధంలో విజేతలై వచ్చాక వారి తెగ పేరు వెనుక 'బర్మా'ను తగిలించడం మొదలైందట. ఏ.డి.సి. అసెంబ్లీ కార్యదర్శి ప్రమోద్ దేవ్‌బర్మా మాకు ఈ విషయం చెప్పారు. దేవ్‌బర్మన్‌లకు దేవ్‌బర్మాలకు మధ్య చాలా తేడా వుంది. దేవ్‌బర్మన్‌లు కూడా ఆదివాసీలే అయినప్పటికీ రాజవంశానికి చెందినవారు. బాగా స్థితిమంతులు. హిందీ సినిమా రంగంలో అత్యంత ప్రతిష్ఠను ఆర్జించిన ఎస్.డి. బర్మన్ (సచిన్‌దేవ్ బర్మన్), ఆయన పుత్రుడు రాహుల్‌దేవ్ బర్మన్‌లు త్రిపుర రాజ వంశానికి చెందినవారే. సచిన్‌దేవ్ బర్మన్ త్రిపుర రాజుకు పినతండ్రి కొడుకు. రాజ వంశంలో పుట్టినప్పటికీ ఎస్.డి. బర్మన్ అభ్యుదయవాది. సంగీతంపై ఆయన దృష్టి సారించి ఆ రంగంలో విశేష కృషి చేశారు. అగర్తల పట్టణంలోని ఎస్.డి.బర్మన్ పూర్వీకుల సౌధంలో ఆగుండ ...యన ప్రభుత్వం సంగీత కళాశాలను నిర్వహిస్తోంది. దేవ్‌బర్మ అని చెప్పుకోవడం కంటే దేవ్‌బర్మన్ అని చెప్పుకొంటే ఎక్కువ గౌరవం లభిస్తుంది కనుక ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన తమ తెగవాళ్లు మెల్లగా తమ ఇంటిపేరును దేవ్‌బర్మన్‌గా మార్చేసుకొంటారని ప్రమోద్ దేవ్‌బర్మా చమత్కరించారు.



ఎస్.డి. బర్మన్

సీరియల్

గని

జరిగిన కథ :-

గని యజమానులకు తమ భూములను అప్పగించిన రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తాడు బికాస్. రకరకాల అనుమానాలు వ్యక్తం చేస్తారు వాళ్లు. మనం ఎక్కువ నష్టపరిహారం, ఉద్యోగం అంటూ మొదలెడితే అసలుకే మోసం వస్తుందేమోనని కొందరంటారు. యజమానులను ఎదిరిస్తే చావుదెబ్బలు తప్పవు కదా అంటారు కొందరు. దేవుడు దయతలిస్తే అన్నీ సవ్యంగా జరుగుతాయి. ఆయన తోడు లేకుంటే ఏవీ జరగవంటారు ఇంకొందరు. అప్పుడు బికాస్ కోపంగా చేసిన దైవదూషణతో ఎవరూ ఏకీభవించరు. కానీ అతని మాటల్లో కొంత నిజం వుందనుకుంటారు. నమ్మకమూ, అపనమ్మకమూ కలగలిసిన రైతుల మనోభావాల్ని అర్థం చేసుకొంటాడు బికాస్. అయితే బికాస్ మాటలవైపే మొగ్గు చూపుతారు రైతులు. అందరూ సంతకాలు చేసి కలెక్టరుగారికి వినతి పత్రం ఇవ్వాలనుకుంటారు. రైతుల చైతన్యం ఇతర ప్రాంతాలలోని కర్షకులలోనూ చైతన్యం తీసుకొస్తుందనుకుంటాడు బికాస్. ఆ తర్వాత....

తమిళ మూలం : **కె. చిన్నప్పభారతి**

అనువాదం : **వి. వెంకటేశ్వర**

(ఇరవై ఐదవ భాగం)

దేశ ప్రజల ఆకాంక్షకూ, ఒక్క తాటి మీద నిలిచి కార్మికులు నడిపిన ఉద్యమానికీ తలొగ్గిన ప్రభుత్వం యాజమాన్యం పట్ల తనకున్న మొగ్గును సడలించుకొని, బొగ్గు గనుల్ని ఎట్టకేలకు జాతీయం చేసింది. గనులయజమానుల గుత్తాధిపత్యం నుంచి తమకు విముక్తి లభించిందని కార్మికుల కుటుంబాల్లో ఆనందోత్సాహాలు వెల్లి విరిశాయి. జీతాలు పెరుగుతాయనీ, చట్ట సమ్మతమైన అన్ని హక్కులూ లభిస్తాయనీ కార్మికుల్లో గట్టినమ్మకం ఏర్పడింది.

ఎన్ని గంటలు పనిచేశారు, ఎంత బొగ్గు తవ్వి పోశారు. అని కాకుండా నెలసరి వేతనం నిర్ధారిస్తారని భావించారు. మైనింగు సర్దారు, తమ పిల్లలు బడికి వెళ్ళకుండా ఆవుల్లో, గొర్రెల్లో మేపుకొంటూ విద్యకు దూరంగా ఉండాల్సిన దుస్థితి ఉండదనీ సగర్వంగా చెప్పుకొన్నారు.

అయితే ఇదంతా పులిని చూసి నక్క వాత పెట్టుకోవడం లాంటిదేనన్న వాస్తవాన్ని వాళ్ళు త్వరలోనే గ్రహించగలిగారు. మొత్తానికి కొత్తసీసాలో పాత సారా పోసిన చందంగానే ఉంది పరిస్థితి.

యజమాని స్థానంలో ప్రభుత్వ యంత్రాంగం బాధ్యతలు రోజువారీ నిర్వహణ మాత్రం యథాపూర్వంగానే సాగుతోంది. సమస్య అంటూ వస్తే సిబ్బంది వ్యవహారాల మేనేజరుతో చర్చలు జరపాలి. పరిష్కారం లభించకపోతే సిబ్బంది. వ్యవహారాల సంచాలకుడ్ని కలుసుకొని చర్చించాలి. అక్కడా పరిష్కారం దొరక్కపోతే, జనరల్ మేనేజరుతో చర్చించాలి.

కార్మికుల్ని పర్మినెంటు చేయడం గానీ, కొత్తగా క్వార్టర్సు కట్టడం గానీ, పిల్లల కోసం పాఠశాల నెలకొల్పడం గానీ, ఇలాంటి చర్యలేవీ తీసుకోలేదు గానీ జీతాలు మాత్రం కొద్దిగా పెంచింది. కొత్త యాజమాన్యం అయితే తవ్వి పోయాల్సిన బొగ్గు తాలూకు పరిమాణాన్ని పరోక్షంగా పెంచేసింది. పాత యజమానుల పద్ధతులనే అనుసరించారు అధికారులు.

కొద్దిరోజుల్లోనే అధికారుల పట్ల అసంతృప్తి రాజుకోసాగింది. బికాస్ నేతృత్వంలోని సంఘం కార్మిక సమస్యల్ని లేవనెత్తినే, చర్చించడానికి విముఖత చూపించారు పైఅధికారులు. గుర్తింపు లేని కార్మిక సంఘంతో చర్చించడం కుదరదంటూ మొరాయించారు. కార్మికులతో తమ అడుగులకు మడుగులొత్తే ఓ సంఘాన్ని పెట్టించారు. గనులు ప్రైవేటు యాజమాన్యం అధీనంలో ఉన్నప్పుడు, కార్మికుల డిమాండ్ల విషయంలో వాళ్ళకు కొన్ని సందర్భాల్లో చాలా సున్నితంగా వ్యవహరించాల్సి వచ్చేది. సమస్య విశ్వరూపం దాల్చితే, కార్మికులకు మద్దతుగా రాజకీయపక్షాలు తలదూర్చవచ్చునీ, వాటి ఒత్తిడి మేరకు ప్రభుత్వమూ జోక్యం చేసుకొని కొలును రద్దు చేసే ప్రమాదం లేకపోలేదనీ యాజమాన్యానికి కొంత భయం ఉండేది. ప్రస్తుతం ప్రభుత్వమే గనుల నిర్వహణ చేపట్టడంతో ఇష్టం ఉన్నా, లేకపోయినా ప్రభుత్వ విధానాన్ని ఆమోదించక తప్పని పరిస్థితి.

తాము కన్న కలలేవీ సాకారం కాకపోవడంతో ఎక్కువ మంది కార్మికుల్లో అసంతృప్తి అపనమ్మకమూ ఏర్పడసాగింది. యాజమాన్యం పట్ల అనుకూల ధోరణి ప్రదర్శించే కార్మిక సంఘానికి అధ్యక్షుడు మనోజ్ కుమార్. దాని సభ్యులు ప్రభుత్వం పరమయినంత మాత్రాన నియమనిబంధనలకు తిలోదకాలిచ్చేసి నట్టేనా? కార్మిక శ్రేయస్సునూ, ప్రజాశ్రేయస్సునూ దృష్టిలో పెట్టుకొన్నందువల్లే గదా! ప్రభుత్వం గనుల్ని జాతీయం చేసింది! అలాంటప్పుడు కార్మికుల క్షేమాన్ని పట్టించుకోలేదనడం దేశభక్తి లేని చర్యే! ఓపిక పట్టండి. మీకు కావలసిన సదుపాయాలన్నీ మేం సమకూర్చి పెడతాం. మిమ్మల్ని తప్పుడు మార్గంలో నడిపించే వాళ్ళ వెంట నడవద్దు" అంటూ ప్రచారం చేశారు.

గనులు ప్రైవేటు యజమానుల అధీనంలో ఉన్నప్పుడు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని గనులలోనూ ఒకే మాదిరి డిమాండ్లతో పోరాడే అవకాశం లేకపోయింది. ఒక్కో గనిలో ఒక్కోరకం సమస్య, ఒక్కోరకం డిమాండు! అయితే గనుల్ని జాతీయం చేయాలి. అన్న ఒక్క డిమాండు మాత్రం దేశవ్యాప్తంగా కార్మికుల్ని సంఘటిత పరిచింది. అలాగే ప్రస్తుతం గని కార్మికుల కోసం వేతన సంఘాన్ని నియమించాలి అన్న డిమాండు అన్ని గనులలోని కార్మికుల దృష్టినీ ఆకర్షించింది.

ప్రైవేటు యాజమాన్యం వాళ్ళు రోజుకు రెండు రూపాయలు కూలి ఇవ్వగా జాతీయం చేయబడ్డాక అయిదు రూపాయలు లభిస్తున్న మాట నిజమే గానీ బానిసలాగా పని చేయించుకొనే పద్ధతి మాత్రం మారలేదు. గతంలో ఒక్కో కార్మికుడు రోజుకు ఒకటింబావు టన్నుల బొగ్గు తవ్వి పోయాల్సి ఉండగా, తక్కువగా తూకం వేసి, నిర్ధారించిన దాని కన్నా ఎక్కువ బొగ్గు తవ్వించే వాళ్ళు. ఇప్పుడూ అదే పరిస్థితి, అదే బెదిరింపు ధోరణే, అదే కక్ష సాధింపు దృక్పథమే. అవే మురికి వాడలు, పూరి గుడిసెలు. మంచినీళ్ళు, పారిశుధ్యమూ కొరవడిన జీవితాలే. బడి మొహం ఎరుగని పిల్లలు, బడికి వెళ్ళాలంటే ఆరేడు మైళ్ళు నడిచి వెళ్ళాల్సిన పరిస్థితి. వడ్డీ వ్యాపారుల దాష్టీకమూ మునుపటి లాగే సాగుతోంది. మరి ఏం మార్పు వచ్చింది? గతంలో కార్మికసంఘ నేతలకు కుక్కకు ఎముకముక్క దొరికినట్లు ఏవో కొన్ని సదుపాయాలు దొరికేవి. ప్రస్తుతం అధికారుల దోపిడీలో వాటా లభిస్తోంది. ఏలినవారు కార్మిక వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడానికి వెసులుబాటు లభిస్తోంది. బలమైన నాయకత్వం లేని స్థలాల్లో కార్మిక సంఘ నేతలూ, యాజమాన్యం వాళ్ల చేతులు కలిపారు.

కార్మికుల క్షేమమే మా ధ్యేయమని పైకి మాత్రం చెబుతూ, ఆచరణలో ఏ మాత్రం పట్టించుకోని కార్మిక సంఘం తమ సంఘానికి చెందిన కార్మికుల్లో అలసత్వాన్ని పెంచి పోషించసాగింది. అంతర్లీనంగా దీని లక్ష్యం ఏమిటంటే, ఉత్పత్తిని తగ్గించడం ద్వారా బొగ్గును తవ్వి పోయడం కోసం ప్రైవేటు సంస్థలతో ఒప్పందం చేసుకోవడానికి మార్గం సుగమం చేయడం. అది అవినీతి అధికారులూ, స్వార్థపరులైన కార్మిక నాయకులూ కలిసికట్టుగా పన్నిన పన్నాగం. కొందరు కార్మికులు దీన్ని గ్రహించకుండా పని ఎగ్గొడుతూ ఊరికినే పొద్దు పుచ్చుతూ, నెల తిరగగానే జీతం అందుకొంటూ ఉత్తిపుణ్యానికి జీతం లభించే సౌఖ్యాన్ని అనుభవిస్తూ అంతిమంగా తమకు తామే గోతులు తువ్వుకొంటున్నారు. దీని ఫలితంగా నష్టాల్లో నడుస్తున్నాయంటూ కొన్ని గనుల్లో కాంట్రాక్టు పద్ధతిలో బొగ్గు తవ్వి పోయడాన్ని అమలు పరిచారు. మోపలేనంత పనిభారం కార్మికుల నెత్తిన మోపారు కాంట్రాక్టర్లు. ఒక్కో కార్మికుడికి అయిదు లేదా ఆరు రూపాయలు మాత్రమే కూలి. కార్మిక నేతలు కొందరు వక్రమార్గాన్ని ఎంచుకొన్నందుకు ఫలితంగా పోరాడి సాధించుకొన్న హక్కుల్ని కొన్ని చోట్ల పోగొట్టుకోవలసివచ్చింది. జాతీయం చేయడం అన్న భావనను నిర్వీర్యం చేయడమే ఉద్దేశ్యంగా తెర వెనుక నుంచి ఊతమిచ్చారు పరిశ్రామాధిపతులు.

వర్గ స్పృహ కలిగిన బికాస్ వంటి కార్మికులకు పెద్దచిక్కే వచ్చిపడింది.

ప్రైవేటు యజమానులు ఉన్నప్పుడు తమది గుర్తింపు పొందిన కార్మిక సంఘం కాగా, ప్రస్తుతం ఆ గుర్తింపుకు ఏ మాత్రం విలువ లేకుండా పోయింది. అధికారులపట్ల అనుకూల ధోరణి ప్రదర్శించే సంఘంతోనే చర్చలు జరిపే కొత్త సంప్రదాయం ఏర్పడింది. తమను పిలవకుండా జరిపే చర్చలూ చేసుకొనే ఒప్పందాలూ తమను కట్టడి చేయజాలవని బికాస్ నేతృత్వంలోని సంఘ కార్మికులకు చెబుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో ఓ సమావేశం జరిగింది.

ఎప్పటి లాగానే కార్మికులు నెమ్మదిగా ఒక్కొక్కరే వచ్చి చేరుతున్నారు. బికాస్ మనసులో ఆలోచనా భారం.

"పేదవాళ్ళ జీవితాలు ఎంత దౌర్భాగ్యంగా ఉన్నాయి? అన్నానికి మారుగా గాలి భోంచేసి కడుపు నింపుకొనే విద్యను దేవుడు వీళ్ళకెందుకు ప్రసాదించలేదు? అలా అయితే, మరొకడి మోచేతికింద గంజి కతుకుతూ పురుగులా జీవించాల్సిన అవసరం ఉండేది కాదు. ఈ గనుల్లో అట్టడుగు పొరల్లోంచి బొగ్గును తవ్వి పోస్తున్నాం. వేడిమి, విషవాయువు, నిల్వనీరు, నిప్పు.. ఇలా ఏదో ఒకటి ప్రకోపించి, మృత్యుముఖంలో పడేసే ప్రమాదం ఉందని తెలిసి కూడా జానెడు పొట్టకోసం సాహసిస్తున్నాం. క్రితం నెల ఈ అడివంతా విరగబూచింది. గూళ్ళలో, గాలిలా సుతిమెత్తని పిల్లలు తల్లిపక్షి తెచ్చిచ్చే ఆహారం కోసం ఎదురుచూస్తూ ఎర్రటి నోరు తెరుచుకొని ఉంటాయి. జలజల పారుతోన్న సెలయేరులో పూలరేకులూ, మకరంద ధూళి కలిసి ప్రయాణం చేస్తుంటే, నీళ్లలో పసుప్పొడి చల్లినట్టు అందంగా వుంది. తల పాపిటలా చీలిన దారుల్లా ఎండుటాకులు, రాలిన పూలు, చెట్లనుండి వెలువడుతోన్న రకరకాల పరిమళాలు అడవంతా అల్లుకొని పావురంలా పసిమి కోల్పోయి శోకసముద్రంలా ఉంది. అయితే త్వరలో రానున్న వసంత ఋతువు అడవికి మళ్ళీ జీవం పోస్తుంది. కానీ కార్మికుల జీవితాల్లో వసంతం జాడ ఏది? జీవం ఏది?

ఒక కార్మికుడు లేచి "రాని వాళ్ళ కోసం ఎంత సేపని వేచి చూస్తాం? అలసిన దేహానికి నిద్రను మించిన మందు లేదు" అంటూ సమావేశాన్ని వెంటనే ప్రారంభించవలసిన ఆవశ్యకతను సూచన ప్రాయంగా తెలియజేశాడు. తక్కిన వాళ్ళు కూడా "అవును త్వరగా ముగించండి" అన్నారు పిలిచినందుకు మొహమాటానికి వచ్చినట్టుగా. సమావేశం ఆవశ్యతను వాళ్ళు గుర్తించలేదు.

సన్నగా పుల్లలా ఉన్న మరొకడు లేచాడు. "మన బతుకు సమస్య గురించి చర్చించబోతున్నాం. పరాయి వాళ్ళ పనిమీద ఇక్కడికి వచ్చినట్టు భావించి మాట్లాడ్డం సమంజసంగా లేదు" అంటూ వాళ్లకు బుద్ధి చెప్పాడు.

"సమస్య గురించి మరొకరు చెప్పగా విని తెలుసుకోవాలా ఏం? అందునా ఇప్పుడు మిన్ను విరిగి మీద పడిందా ఏం?" అన్నాడు ఒకడు తన విశాల నేత్రాలతో చుట్టూ కలయజూస్తూ. సమావేశం లక్ష్యానికి వ్యతిరేక భావాలతో గందరగోళం సృష్టించాలన్న ఉద్దేశ్యంతో.

"ఇబ్బంది ఏముందని అడుగుతున్నావా? మా పెళ్ళాం బిడ్డలకు రెండో జతలబట్టలు లేవు. రాత్రి పూట బట్టలు ఉతికి, గోనెసంచులు కప్పుకొని పడుకొంటున్నారు. మీ ఇంట్లో మాత్రం రకరకాల బట్టలూ నగలూ తళతళలాడుతున్నాయి కదా! విశ్వాసం చూపించాలి కదా!" అంటూ చురక వేశాడు మరొకడు.

అతడి మాటలు అర్థం కానివారెవరూ లేరు. విశాలనేత్రుడి అందమైన భార్య మేనేజరు గారింటికి అప్పుడప్పుడు వెళ్ళిరావడం బహిరంగ రహస్యమే.

సిగ్గుతో చితికిపోవాల్సిన మాటలు విని కూడా అతడు ఏ మాత్రం చలించలేదు. దేనికైనా ఇచ్చి పెట్టుకోవాలి. భూతంలా ఉంటే కుక్కయినా దరిచేరదు కదా!! అన్నాడు కించిత్ గర్వంగా.

బికాస్ మనసులో ఆలోచనలు వెల్లువెత్తుతున్నాయి. ముందెన్నడూ లేని తీవ్ర పరిస్థితులు దాపురించాయి. ఉద్యోగాల్లేవు. ఉద్యోగాలు చేసుకొంటున్న వాళ్ళకు ఉద్యోగ భద్రత లేదు. ఎప్పుడు ఊడుతుందో తెలియదు. పేదరికం, ఆకలి, నిరక్షరాస్యత, వ్యాధులు... పేదరికం పిరికితనాన్ని ప్రోత్సహిస్తోంది. బతుకు భారమై ఊపిరాడని పరిస్థితి. బూతు పుస్తకాలూ, పగటి కలలూ ప్రజల్ని భ్రమల్లో విహరింపజేస్తున్నాయి. రోగాన్ని నయం చెయ్యడం పట్ల కాకుండా, రోగతీవ్రతను తగ్గించడం పట్ల శ్రద్ధ ఎక్కువయింది.

నెరిసిన వెంట్రుకలు, గుబురు మీసం, పీక్కు పోయిన చెంపలతో ఓ ముసలాడు "ఎందుకు బాబూ, మౌనంగా వున్నావు? ఎంగిలి మెతుకులకు అలవాటు పడ్డ కుక్కకు పాయసం పెట్టినా రుచించదు. వాడి మాటలకు విలువ ఇవ్వాల్సిన పనిలేదు" అంటూ బికాస్ ఆలోచనల్ని భగ్నం చేశాడు.

బికాస్ మనసులో అగ్నిపర్వతం బద్దలవుతున్నట్టుగా ఉంది. క్షణమాత్రంలో అతడు నిలువెల్లా ఆవేశంతో ఊగిపోయాడు.

దేశవ్యాప్తంగా గనులన్నీ ఎలా జాతీయం చేయబడ్డాయి. పారిశ్రామిక వేత్తలు మనపట్ల దయతలచి గనుల్ని ప్రభుత్వ పరం చేశారా? దాని కోసం ఎంతగా పోరాడాల్సి వచ్చింది? తన్నులు ఓర్చుకున్నాం, తుపాకీ గుళ్ళకీ వెరవకుండా ఎదురొడ్డాం. చెరసాలల్లో మగ్గిపోయాం! ఉద్యోగం కోల్పోయి ఎంతమంది బిచ్చగాళ్ళయిపోలేదు! ఎంతమంది స్త్రీలు తమ దేహాల్ని అమ్ముకొన్నారు. ఇవాళ మళ్ళీ అలాంటి జీవితంలోకి నెట్టబడుతున్నామంటే నిరుడుపడ్డ కష్టాలు, చేసిన త్యాగం వృథా అయినట్టే కదా! ఎందుకు ఇప్పుడిన్ని బాధలు అనుభవించాలి?

అందరి మధ్యా కొద్దిసేపు నిశ్శబ్దం రాజ్యమేలింది.

జీవితం పట్ల బికాస్‌కు ఉన్న దృక్పథమూ, అవగాహనా చెప్పదలచుకొన్న విషయాన్ని సరళంగానూ, ఆకర్షణీయంగానూ చెప్పగలిగే సామర్థ్యమూ కార్మికుల మధ్య అతడి పట్ల అభిమానాన్ని పెంచింది.

"మేయడానికి వెళ్ళే మేకల్లో కొన్ని మేకలు ఏ మాత్రం కష్ట పడకుండా దొంగతనంగా మేయడానికి ప్రయత్నిస్తాయి. కాయకష్టం చేయకుండా ఉత్తినే కడుపు నింపుకొనే వాళ్ళూ ఇలాంటి వాళ్ళే" అన్నాడొకడు.

(ఇంకావుంది)



నిఖత్ ఖాతున్,
7వ తరగతి,
ఇడెన్ హై స్కూల్,
మౌలాలి,
హైదరాబాద్.

ఎన్. నాగచంద్,
9వ తరగతి,
బి.వి. సుబ్బయ్య హై స్కూల్,
పేర్నమిట్ట.

ఆ బొమ్మ ఏది?

ఫ్రెండ్స్... కింద కనిపిస్తున్న గజిబిజి గళ్లలో కన్ని 0గుర్తులు, కొన్ని +గుర్తులు వున్నాయి చూశారుగా. వాటిలో 0గుర్తు ఉన్న అన్ని చోట్లా నీలం రంగు, +గుర్తు ఉన్న చోట నలుపు రంగు వేసి చూడండి. ఏజంతువు కనిపిస్తుందో చెప్పండి.



జత చేద్దాం

ఫ్రెండ్స్! పైన కొన్ని బొమ్మలున్నాయి కదా. వాటిలో రెండు వస్తువులను ఒక జతగా వాడుతుంటాం. వీటిలో ఏ వస్తువు దేనికో కనిపెట్టి జత చేయండి.

సాయం చేయండి!

పిల్లలూ... కోడికి తన పిల్లల దగ్గరికి వెళ్లడానికి సరైన దారి కనిపించడం లేదట. మరి మీరు కూడా కొంచెం సాయం చేస్తారా.

ఆకుల గాడిద

పిల్లలూ! చూశారుగా ఈ వారం మీకోసం గాడిదను తీసుకొచ్చాం. మీరు కూడా ఇలాంటి ఆకారాలున్న ఆకులు తీసుకుని గాడిదను తయారు చేస్తారుగా.



ఎన్ని జంతువులో...

చిన్నారులూ...ఇక్కడ కొన్ని రకాల జంతువులు వున్నాయి. అవి ఎన్ని వున్నాయో, ఏ యే జంతువులు వున్నాయో చెప్పకోండి చూద్దాం.





పదాలు రాస్తే పోలా...

పిడుగులూ... కింద కనిపిస్తున్న వస్తువుల పేర్లను పక్కనే ఇచ్చిన గళ్లలో అడ్డంగా నిలువుగా రాసేయండి.



నేర్చుకుందాం

జవాబులు

పదాలు రాసేపోలా...: 1.harp, 2.sock, 3.cake, 4.house, 5.skate.

జతచేద్దాం..: 1-9, 2-6, 3-7, 4-10.

ఎన్ని జంతువులో...: మొత్తం 5. కుక్కపిల్ల, పెంగ్విన్, ఎలుక, పందిపిల్ల, తాబేలు.

సుమెరా ఫిర్దోస్



ఈద్-ఉల్-ఫితర్... ముస్లింలకు అతిపెద్ద పండుగ. ఉపవాస దీక్షతో ఈ పండుగ ఉత్సాహం నెలరోజుల పాటు ఉంటుంది. రంజాన్‌లో ముస్లింలు ఉండే 'రోజా' తోటివారి ఆకలి బాధను అర్థం చేసుకొని వారిని ఆదుకోవాలని నేర్పుతుంది. త్యాగం, దానం చేయడం ద్వారా ధనిక, పేద అనే తేడా లేని సమాజాన్ని నిర్మించాలని సూచిస్తుంది. ఏడాదంతా సంపాదించే ముస్లింలు ఈ నెల రోజుల్లో చేతికి నరం లేని విధంగా దాన ధర్మాలు చేస్తారు. అంటే సంపాదించి కూడబెట్టడంలో సంతోషం లేదని లేనివారికి దాన్ని అందించడంలోనే తృప్తి ఉందని తెలియజెప్తుంది 'రంజాన్'. అటువంటి ప్రాధాన్యత కల్గిన పండుగ విశేషాలను ఈ వారం అట్టమీది కథలో మీకోసం అందిస్తున్నాం. అందుకోండి మరి.

రసరమ్యం రంజాన్ పర్వం

ముస్లింలు జరుపుకునే పండుగల్లో ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్ పండుగ) అతిపెద్దది. అత్యంత భక్తి శ్రద్ధలతో, ఉత్సాహపూరిత వాతావరణంలో దీన్ని జరుపుకుంటారు. నెల రోజుల కఠిన ఉపవాస దీక్ష పూర్తిచేసుకున్న ముస్లింలు నెలవంక కనిపించిన మరుసటి రోజు దీక్షను ఆపేసి పండుగ చేసుకుంటారు. 'ఈద్' అనే పదం అరబిక్ 'ఔద్' (మళ్లీ మళ్లీ వచ్చేది) అనే పదం నుండి వచ్చింది. ఫితర్ అంటే త్యాగం, దానం చేయడం. ఈ పండుగను రంజాన్ లేదా రమదాన్ అని కూడా అంటారు. అరబిక్‌లో 'రమిదా లేదా అరమద్' అంటే తీవ్రమైన వేడి, ఎండిపోవడం అని అర్థం. ఈ నెలలో రోజంతా ఏమీ తినకుండా ఖాళీ కడుపుతో ఉండడం అన్నమాట. ఇస్లామిక్ క్యాలెండర్ (హిజ్రీ) ప్రకారం రంజాన్ నెల తొమ్మిదవది. పదవ నెల (షవ్వాల్ నెల) మొదటి తేదీన ఈద్-ఉల్-ఫితర్ జరుపుకుంటారు. రంజాన్ నెలలోని చివరి పది రోజుల్లోని ఏదో ఒకరోజు ఖురాన్ దివి నుండి భూమికి వచ్చిందనేది ముస్లింల నమ్మకం. అందుకే ఈ నెలలోని చివరి పది రోజులకు ప్రాధాన్యత ఇస్తారు. 27వ రోజు రాత్రి జాగారం చేస్తారు. ఆ రాత్రిని 'షబ్-ఎ-ఖదర్' అని పిలుస్తారు. అంటే షబ్ అంటే రాత్రి, ఖదర్ అంటే గౌరవించడం అని అర్థం. అంటే ఖురాన్ భూమిపైకి ఆ రాత్రే వచ్చిందని (ముఖ్యమైన చివరి పది రోజుల్లో ఈ రాత్రి అత్యంత ముఖ్యమైనది) ముస్లింలు బలంగా నమ్ముతారు. అందుకే ఆ రాత్రంతా జాగారం చేస్తూ ఖురాన్ పఠనం, నమాజ్‌లో గడుపుతారు.

ప్రతిరోజు ముస్లింలు ఐదుసార్లు నమాజు చేయడం ఆనవాయితీ. ఉదయపు నమాజ్‌ను 'ఫజర్', మధ్యాహ్నం 'జొహర్', సాయంత్రం 'అసర్', సూర్యాస్తమయం తర్వాత 'మగ్‌రిబ్', రాత్రి చేసే నమాజ్‌ను 'ఇషా' అంటారు. రోజూ చేసే ఈ ఐదు నమాజులకు తోడు రాత్రి 'ఇషా' నమాజ్ పూర్తయిన తర్వాత 'తరావీ' అనే నమాజ్‌ను రంజాన్ నెలలో గంటసేపు ప్రత్యేకంగా చేస్తారు. ఈ తరావీ నమాజులో 'ఇమామ్' ఖురాన్ పఠనం చేస్తారు. రంజాన్ నెలలో కనీసం ఒక్కసారైనా ఖురాన్‌ను పఠించాలనే నిబంధన ఉంది. అరబ్బీలో ఉన్న ఖురాన్‌ను చదవలేని వాళ్లు ఈ నమాజ్‌లో పాల్గొంటే ఖురాన్‌ను పఠించినట్లే.







ఈద్‌గాహ్‌లో నమాజ్

ముస్లింలంతా పండుగ రోజు ఉదయమే స్నానపానాదులు చేసి, షీర్‌ఖుర్మా సేవించి, కొత్త వస్త్రాలు ధరించి, ప్రత్యేక ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ చేస్తారు. చిన్న పెద్ద తేడా లేకుండా పురుషులూ, మహిళలూ ప్రత్యేక నమాజ్ చేస్తారు. పురుషులు నమాజును రోజూ చేసే మసీదులో కాకుండా ఊరి బయట విశాల మైదానంలో ఉండే 'ఈద్‌గాహ్'లో (ఓపెన్ గ్రౌండ్)లో చేస్తారు. మహిళలు ఇంట్లో చేస్తారు. కుటుంబం, సమాజం పట్ల మనకు గల ప్రత్యేక బాధ్యతలను ఇమామ్ (పూజారి) తన 'ఖుత్బా' (ప్రసంగం)లో వివరిస్తారు. శత్రువులను క్షమించడం, కొత్త స్నేహాలు చేయడం ఈ నెలలోనే జరుగుతుంది. శత్రువులనేవారు లేకుండా అందరూ కలిసి మెలిసి ఉండాలనే ఉద్దేశ్యంతో నమాజ్ తర్వాత అందరూ 'ఈద్-ముబారక్' చెప్తూ ఆలింగనం చేసుకుంటారు. గతంలో చేసిన తప్పులను ప్రక్షాళన చేసి స్నేహితులు, బంధువులతో కొత్త సంబంధాలను నెలకొల్పుకోవాలని ముస్లింలు భావిస్తారు. తర్వాత శ్మశానానికి వెళ్లి బంధువుల సమాధుల వద్ద పూలు ఉంచి, ప్రార్థన చేసి స్మరించుకుంటారు. అంతేకాదు స్నేహితుల, బంధువుల ఇళ్లకు వెళ్లి 'ఈద్-ముబారక్' చెప్పుకుంటారు. ఈ ఆనందోత్సాహాలు పండుగ అయిపోయిన మూడు రోజుల వరకూ కొనసాగుతాయి. భారత్‌లాంటి దేశాల్లో ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా ఒకరోజు సెలవు ఉంటుంది. ముస్లిం దేశాల్లో మూడు రోజుల సెలవు ఉంటుంది. బ్రిటన్ లాంటి దేశాల్లో పండుగ రోజు సెలవు ఉండదు.

ఏ దేశంలో ఎలా...?

రంజాన్ పండుగను ప్రపంచ వ్యాప్తంగా ఏవిధంగా జరుపుకుంటారో తెలుసుకుందాం.

ఆనందోత్సాహాలతో...

బంగ్లాదేశ్, భారత్, శ్రీలంక, పాకిస్తాన్ వంటి దక్షిణాసియా దేశాల్లో ఈద్-ఉల్-ఫితర్‌ను ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటారు. పండుగ కంటే ఒకరోజు ముందే వారి ఆర్భాటం ప్రారంభమవుతుంది. మహిళలు గాజులు కొనడం, చేతులకు గోరింటాకు పెట్టుకోవడంలో బిజీగా గడుపుతారు. పండుగకు ఒకరోజు ముందు రాత్రిని ఈ దేశాల్లో 'చాంద్ రాత్' అంటారు. ఆరోజు చంద్రుడు కనిపిస్తాడన్నమాట.

ప్రపంచంలో ఎక్కువ మంది ముస్లింలు ఉన్న దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉంది. ఇక్కడ 12 శాతం (12 కోట్లకు పైగా) ముస్లింలు ఉన్నారు. భారత్‌లో ఇస్లాం క్రీస్తు శకం 12వ శతాబ్దంలో ప్రవేశించింది. పలు మతాలతో కూడిన భారత సంస్కృతీ సాంప్రదాయాల్లో ఇస్లాం ఇమిడిపోయింది. కాశ్మీరీ ముస్లింలు ఈద్ రోజు సేమ్యా చేయరు. దానికి బదులు మాంసంతో కూడిన వంటకాలు - తీపి మాంసం, కహ్వా (డ్రై ఫ్రూట్స్, సుగంధ ద్రవ్యాలతో కూడిన కాశ్మీరీ టీ) తయారు చేస్తారు.

అంగరంగ వైభవంగా...

ఇండోనేషియా, మలేషియా, సింగపూర్, బ్రూనే వంటి ఆగ్నేయాసియా దేశాల్లో అంగరంగ వైభవంగా జరుపుకుంటారు. ఈ దేశాల్లో ఈ పండుగను హరి రాయ ఐదిల్‌ఫిత్రి, హరి ఓతక్, హరి రాయా ఈదుల్ ఫిత్రి లేదా హరి రాయా పువాసా అని పిలుస్తారు. ఆగ్నేయాసియా దేశాల్లో ఇది అతిపెద్ద పండుగ. వారం రోజుల ముందునుండే మార్కెట్లు, దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతుంటాయి. పండుగ రోజు బ్యాంకులు, ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, దుకాణాలు మూసి ఉంటాయి. పండుగకు ఒకరోజు ముందు 'తక్బీర్' మసీదుల్లో, ముసల్లాల్లో జరుపుతారు. ఇండోనేషియా, మలేసియాల్లో ప్రజలు పెద్ద మెట్రోపాలిటన్ నగరాల నుండి స్వస్థలాలకు (గ్రామాలకు) తరలివెళ్తారు. దీన్ని బాలిక్ మంపంగ్ లేదా పులాంగ్ కంపంగ్ (ఇంటికి తిరిగి వెళ్లడం) అంటారు. తదుపరి రోజు జరిగే ఈద్‌ను కుటుంబ సభ్యులతో జరుపుకుంటారు. ఈ సందర్భంగా కెటుపట్, డోడోల్, లెమాంగ్ (బియ్యంతో వెదురు బొంగుల్లో వండే వంటకం)తో పాటు ఇండో-మలాయ్ రుచికర వంటకాలు ఈద్ రోజు డైనింగ్ టేబుల్‌పై

ఉపవాస దీక్ష (రోజా)

రంజాన్ నెలలో నెల రోజుల కఠిన ఉపవాస దీక్ష చేస్తారు. ఉపవాస దీక్ష సూర్యోదయానికి ముందు ప్రారంభమై సూర్యాస్తమయం తర్వాత పూర్తవుతుంది. అంటే సూర్యుడు ఉదయించిన తర్వాత నుండి అస్తమించే వరకూ పచ్చి మంచినీళ్లు కూడా ముట్టరాదు. దాన్నే 'రోజా' అంటారు. సూర్యోదయానికి చాలా ముందు చేసే భోజనాన్ని 'సహర్' అంటారు. సూర్యాస్తమయానికి ముందు పళ్ల ముక్కలు స్వీకరించి దీక్ష విరమిస్తారు. దీన్ని 'ఇఫ్తార్' అంటారు. తర్వాత మగ్‌రిబ్ నమాజ్ పూర్తి చేసుకుని భోజనం చేస్తారు. అప్పటి నుండి 'సహర్' వరకు ఏదైనా తినొచ్చు. గర్భవతులు, సుదీర్ఘ ప్రయాణంలో ఉన్నవారు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు 'రోజా' నుండి మినహాయింపు వుంటుంది. పేదవాళ్ల ఆకలి బాధలను అర్థం చేసుకొని వారిని ఆదుకోవాలన్నదే 'రోజా' ప్రధానోద్దేశ్యం. ఉపవాస దీక్షలో ఉన్నవాళ్లు అబద్ధమాడరాదు. కళ్లముందు ఆహారం, నీళ్లు కనబడినా తినకుండా, తాగకుండా ఉండటం ద్వారా మానసిక దృఢత్వాన్ని కనబర్చాలి.

ఫితర్

ఫితర్ అంటే దానం చేయడమని అర్థం. ఈద్ అంటే పండుగ. ఈద్-ఉల్-ఫితర్ అంటే దానం చేసే పండుగ. ప్రతి ముస్లిం కనీసం 1.75 కేజీల గోధుమలు, 3.5 కేజీల బియ్యం పేదలకు దానం చేయాలి. ఈ నెలలో పేద ముస్లింలకు దాన ధర్మాలు చేసే వారు కూడా సంతోషంతో పండుగ చేసుకునే అవకాశాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క ముస్లింపై ఉంది. రంజాన్ నెలలో జకాత్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. జకాత్‌ను డబ్బులు లేదా తినుబండారాల రూపంలో (ఖర్జూరం, గోధుమలు, బార్లీ, పండ్లు, తదితరాలు) ఇస్తారు. ఈ జకాత్‌ను మసీదులో కూడా అందజేస్తారు. గతించిన తమ కుటుంబ పెద్దల పేరుమీద కూడా ప్రత్యేక జకాత్ ఇస్తారు. జకాత్‌కు ఖర్చుచేసే డబ్బు మన సంపాదనలో దేవుడికి చెల్లించే పన్ను అన్నమాట. 53.5 తులాల వెండి లేదా దానికి సరితూగే ఆస్తి కలిగి ఉన్న ప్రతి ముస్లిం 2.5 శాతం ఆదాయాన్ని జకాత్ రూపంలో చెల్లించాలి.

దర్శనమిస్తాయి. ప్రజలు 'సెలామత్ హరి రాయా ఈదుల్ ఫిత్రి' లేదా 'సలామ్ ఐదిల్‌ఫిత్రి' (ఈద్ శుభాకాంక్షలు) అని అంటూ ఒకరినొకరు అభినందనలు తెలుపుకుంటారు. 'మాఫ్ లాహిర్ దాన్ బాతిన్' (గతంలో చేసిన తప్పులను క్షమించండి) అని అంటారు. పిల్లలు 'డియుట్ రాయా' అంటే పెద్దల నుండి డబ్బుల టోకెన్ కోసం ఆసక్తితో ఎదురుచూస్తారు.

స్నేహ సౌభ్రాతృత్వాలు

ప్రజలు ఆరోగ్యవంతంగా, పవిత్రంగా, స్నేహసౌభ్రాతృత్వాలతో జీవించాలని 'ఇమామ్' బోధనల ద్వారా బ్రిటన్‌లో ఈద్ ఉల్ ఫితర్ ప్రారంభమవుతుంది. 'ఖుత్బా' (ప్రసంగం), నమాజ్ తర్వాత ఈద్ ఉల్ ఫితర్‌ను ఇమామ్ ప్రకటించగానే అందరూ అభినందనలు తెలుపుకుంటూ ఒకరినొకరు కౌగలించుకుంటారు. అయితే అక్కడ పండుగ రోజును సెలవు దినంగా ప్రకటించరు. ముస్లింలు ఉదయం ప్రార్థనలు చేసుకునేందుకు వీలు కల్పిస్తారు. ప్రార్థనల తర్వాత సమీప బంధువులు, కుటుంబ సభ్యుల సమాధుల వద్దకు వెళ్లి నివాళులర్పిస్తారు. ఇంటికి తిరిగి వస్తూ ముస్లింలంతా తమ స్నేహితులు, బంధువుల ఇళ్లకు వెళ్లి శుభాకాంక్షలు తెలుపుకుంటూ, ఏడాదంతా శుభం కలగాలని ఆకాంక్షిస్తారు. ఆ రోజున సమోసా, సేమియా, అన్నం, హాండిష్ వండుతారు.

చంద్రదర్శనమే ప్రధానం

ఈ ఖండంలో చంద్ర దర్శనాన్ని బట్టి తూర్పు, పశ్చిమ దేశాల్లో వేర్వేరు రోజుల్లో పండుగ చేసుకుంటారు. రంజాన్ పవిత్ర మాసం ముగిసిందనడానికి, షవ్వాల్ నెల ప్రారంభమైందనడానికి ప్రత్యేక కమ్యూనిటీ వాళ్లు వేర్వేరు ప్రమాణికాలను అవలంబిస్తారు. ఉత్తర అమెరికా వాసులు ప్రశాంతంగా జరుపుకుంటారు. పండుగ రోజు ముస్లింలు వేకువజామునే నిద్రలేస్తారు. బ్రేక్‌ఫాస్ట్ పూర్తిచేసుకుని, మసీదుకెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. తర్వాత కుటుంబ సభ్యులు, బంధువులు అభినందనలు తెలుపుకుంటారు.

ఏడాదంతా ఎదురుచూపు

ఈ పండుగ కోసం టర్కీ వాసులు ఏడాదంతా ఎదురు చూస్తారు. ఈద్ ఉల్ ఫితర్‌ను సెకర్ బేరామి లేదా రమజాన్ బేరామి అని పిలుస్తారు. కుటుంబ సభ్యులు, బంధువులు ఒకచోట గుమిగూడి ఉత్సవం జరుపుకోవడానికి దీనికి మించిన అవకాశం లేదు. ప్రజలు 'బేరామినిజ్ కుత్లు ఓల్సన్ (బేరామ్ జరుపుకున్నాం), ముత్లు బేరామ్లర్, 'బేరామినిజ్ ముబారక్ ఓల్సన్' అని అభినందించుకుంటారు. ఈద్ ఉల్ ఫితర్ ఉత్సవాలను టర్కీలో జాతీయ సాంప్రదాయంగా జరుపుకుంటారు. యువకులు వృద్ధుల కుడిచేతిని ముద్దు పెట్టుకొని, గౌరవసూచకంగా తమ చేతిలోకి తీసుకుంటారు. బేరామ్ అని అభినందిస్తారు. చిన్నారులు ఇంటింటికి హుషారుగా వెళ్లి 'బేరామ్' అని అభినందిస్తూ, వాళ్లిచ్చిన చాక్లెట్లు, సాంప్రదాయ స్వీట్లు, డబ్బులు తీసుకొని ఇంటికొస్తారు. కరగ్జ్, హాసివాత్ షాడో థియేటర్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

సేవా కార్యక్రమాలకే పట్టం

షియాలు ఎక్కువగా నివసించే ఇరాన్‌లో ఈద్ ఉల్ ఫితర్‌ను అత్యంత ఉత్సాహంగా జరుపుకుంటారు. ఐదే ఫితర్ అని పిలిచే ఈ పండుగ రోజున ఛారిటీ (సేవా) కార్యక్రమాలతో ఇరానియన్లు తరిస్తారు. ఉదయం అందరిలాగే ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. తమకంటే పెద్దవారి ఇళ్లకు వెళ్లి కుటుంబ, స్నేహితులు కలిసి పండుగ చేసుకోవడం అక్కడ సర్వసాధారణం. ఆకలితో అలమటిస్తున్న పేదలకు ఆహారం అందిస్తారు. పండుగ రోజు ఫిత్రా లేదా ఫిత్రియే (దానం) ప్రతి ముస్లింకు తప్పనిసరి.

ఒకరోజు ముందే మొదలు

సౌదీ అరేబియాలో ఇది అతిపెద్ద పండుగ. రంజాన్ మాసంలో ఖురాన్‌ను పఠిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. చంద్రుడు కనిపించగానే మూడు రోజుల పాటు పండుగ చేసుకుంటారు. సాధారణంగా భారత్ కంటే ఒకరోజు ముందుగానే ఇక్కడ పండుగ చేసుకుంటారు. అత్యంత వైభవోపేతంగా







జరుపుకునే ఈ పండుగ రోజు ముస్లింలంతా ఒకేచోట చేరి ముస్లింల పవిత్ర నగరమైన మక్కా వైపు ముఖం పెట్టి నమాజు చేస్తారు. ఇళ్లను అలంకరిస్తారు. ప్రపంచ నలువైపులా ఉన్న ముస్లింలకు ఫిత్రా, జకాత్ అందజేస్తారు.

రకరకాల పద్ధతులు

ఆఫ్రికాలోని మధ్య, తూర్పు, పసిఫిక్ దేశాల్లో వేర్వేరు విధాలుగా పండుగ జరుపుకుంటారు. అందరూ కుటుంబ ఉత్సవంగా జరుపుకుంటారు. ఉదయం జరిగే ప్రత్యేక ప్రార్థనల్లో కొన్ని దేశాల్లో మహిళలు కూడా పాల్గొంటారు. తర్వాత కుటుంబ పెద్ద ఇంట్లో లంచ్ ఏర్పాటు చేస్తారు. అన్ని దేశాల్లో మాదిరిగానే పిల్లలకు ప్రత్యేక బహుమతులు, నగదు, కొత్త బట్టలు అందజేస్తారు. ఉత్సవాలు ఐదు రోజుల పాటు కొనసాగుతాయి. బిర్యానీ, స్వీట్ వంటకాలు ప్రత్యేకంగా తయారు చేస్తారు.

ప్రత్యేక వంటకాలు

మహిళలు ఈద్ నమాజ్‌ను ఇంట్లోనే చేస్తారు. ఇంట్లో ప్రత్యేక వంటకాలు చేయడంలో వాళ్లు బిజీగా ఉంటారు.

బాదామీ గోష్ : ఈద్ ఉల్ ఫితర్ రోజు చేసే నాన్ వెజిటేరియన్ ప్రత్యేక వంటకమిది. సువాసన వెదజల్లే, రుచికరమైన ఈ వంటకాన్ని ప్రతిఒక్కరూ లొట్టలేసుకుంటూ తింటారు.

బాదామ్ ఫిర్ని : ఇది తీపి వంటకం. పాలు, పాల పదార్థాలతో (ఖోవా, నెయ్యి) చేసే ఈ వంటకం రుచితో పాటు బలవర్ధకం. ఈద్‌కు ఈ వంటకం ప్రత్యేక ఆకర్షణ.

నవాబీ బిర్యానీ : మార్కెట్‌లో సునాయాసంగా లభించే వస్తువులతోనే రుచికరంగా వండే నాన్ వెజిటేరియన్ వంటకం. వండటం చాలా సులభం.

హలీమ్ : భారత్, పాకిస్తాన్, పర్షియాల్లో ఈ వంటకం ప్రఖ్యాతిగాంచింది. రంజాన్, మొహర్రమ్ నెలల్లో ముస్లిం దేశాల్లో దీన్ని ప్రత్యేకంగా తయారు చేస్తారు. ముస్లింల పెళ్లిళ్లలో భోజనం కంటే ముందుగా హలీం సర్వ్ చేస్తారు.

మటన్ ఖుర్మా : ఇది ముస్లిం ప్రపంచంలో ప్రఖ్యాతిగాంచింది. భారత్‌లో ముస్లింలతో పాటు ముస్లిమేతరులు కూడా మటన్ ఖుర్మాను ఇష్టంగా తింటారు.

సేమియా : పాలు, సుగంధ ద్రవ్యాలు వేసి వండే వంటకం. పండుగల రోజే కాకుండా సాధారణంగా ప్రతి ఇంట్లోనూ వండుతారు. భారత్‌లో ముస్లింలతో పాటు హిందువులు కూడా దీన్ని తింటారు. తక్కువ ఖర్చుతో త్వరగా వండగలగడం దీని ప్రత్యేకత.

షీర్‌ఖుర్మా : షీర్ అంటే తీయటి పాలు. డ్రై ఫ్రూట్స్, ఖర్జూరంతో కూడిన పాయసం ఖుర్మా. ఈద్ రోజు ఉదయం షీర్ ఖుర్మా సేవించి నమాజ్‌కు వెళ్తారు. ఇంటికి వచ్చి అభినందించే బంధు మిత్రులకు కూడా దీనిని అందిస్తారు.

సూఫీ మల్‌పువా : పాలు, మైదా, రవ్వలతో కూడిన తీపి వంటకం. ప్రపంచవ్యాప్తంగా ముస్లింలలో ఇది ప్రాచుర్యం పొందింది. భారత్‌లో కూడా అన్ని మతస్తులు దీన్ని పండుగల సందర్భంగా ఎక్కువగా వండుతారు.

భారత్, పాకిస్తాన్, ఫిజీల్లో 'సవయ్యా' అనే ప్రత్యేక వంటకం తయారు చేస్తారు. న్యూడిల్స్‌తో కూడిన ఈ వంటకం బ్రిటన్‌లోని చాలా స్టోర్స్‌లోనూ లభిస్తుంది.

★

వారం ముందే సందడి

రంజాన్ పండుగ సందడి వారం ముందునుండే మొదలవుతుంది. మార్కెట్లు జనాలతో కిటకిటలాడతాయి. రంజాన్ నెల 29వ లేదా 30వ రాత్రి చంద్రుడు కనబడగానే రంజాన్ నెల ముగిసినట్లు. అప్పటివరకు కొనసాగుతున్న దీక్షను విరమించి మరుసటి రోజు ఈద్-ఉల్-ఫితర్ జరుపుకుంటారు. ఇతర మతస్తులు కూడా ముస్లింల ఇళ్లకు వెళ్లి ఈద్ ముబారక్ (అభినందనలు) చెప్పి తమ సంతోషాన్ని, స్నేహ వాత్సల్యాన్ని కనబరుస్తారు. ఈ సందర్భంగా ప్రత్యేక వంటకాలను వారికి వడ్డించి ముస్లింలు తమ సంతోషాన్ని ప్రకటిస్తారు. ఈద్ సందర్భంగా బహుమతులు కూడా ఇచ్చిపుచ్చుకుంటారు. కూతుళ్లకు, పెళ్లయిన సోదరీమణులకు పురుషులు బహుమతులు ఇస్తారు. పెళ్లి అయిన సోదరీమణుల ఇళ్లకు సోదరులు కొత్త బట్టలు, గాజులు, డబ్బులు తీసుకెళ్లి ఇస్తారు. ఈ పండుగ ద్వారా వారి అనుబంధం మరింత ఇనుమడిస్తుంది. చిన్నారులకు కూడా పెద్దవాళ్లు డబ్బులు (ఈదీ) ఇచ్చి సంతోషపెడతారు.

కవిత్వమ్

కాలం



'ప్రాణం' తర్వాత తిరిగిరానిది
'కాలం' ఒక్కటే!
కోట్లు వెచ్చించినా రాని ఉచితవస్తువు
ఖర్చు చెయ్యకుండానే ఖర్చయిపోతుంది
ఎంతో ఉందనిపిస్తుంది
కానీ,
పూర్తయ్యేవరకు తెలిసిరాదు.
ఎన్నో జటిల సమస్యలను పరిష్కరిస్తుంది
మానసిక గాయానికి
తిరుగులేని మందు కాలం!
కానీ ప్రతిక్షణం నిన్ను
మరణానికి చేరువ చేశావంటే,
ఇది నీ జీవితాన్ని వృథా చేస్తుంది
నీ తుది శ్వాస వరకూ
నీ చేతుల్లోంచి జారిపోతూనే ఉంటుంది
అనుభవ పాఠాలు నేర్పటంలో
గురువులకే గరువు లాంటిది
దీని ప్రవాహంలో పడి
కొట్టుకుపోయిన వాళ్ళెందరో!
కానీ పడవ ప్రయాణం చేసి
ఉన్నత తీరాలను చేరినవాళ్ళు కొందరే!
అందుకే,
గొప్ప వ్యక్తులదగ్గర ఉన్న
అతి విలువైన వస్తువు
ఈ'కాలం' ఒక్కటే!

చెమట రుచి

కష్టపడుతుంటే తెలిసింది
చెమట రుచి లోని కమ్మదనం ఏంటో!
ఇప్పుడే అర్థమయింది నాకు
ఇష్టానికి పర్యాయపదమే
'కష్టం' అని!
ఒకరోజు హఠాత్తుగా
సోమరితనం నుండి మేల్కొన్నాను!
పగటి నిద్ర పూర్తిగా చెడింది!
నా బద్ధకాన్ని బద్దలు చేస్తూ
ఓ పీడకల నన్ను
తరచుగా పీడిస్తోంది
వద్దన్నా ఒక వాస్తవాన్ని వల్లిస్తోంది
"నేటి నిశ్చల సుఖం
రేపటి దుఃఖానికి నాంది" అని!
"నేటి నిరంతర శ్రమ
రేపటి సంతోషానికి సోపానం" అని!
నిజమే మరీ!
కూర్చొని తింటుంటే
కొండలు కరగిపోక పోవచ్చు
కండలు పెరిగిపోవచ్చు
కానీ,
కోటి అనుభూతులు కడతేరిపోతాయి
అంతే....!

ఎస్. వేణుగోపాల్

మానస వ్రతం

రణం చేస్తేనే
ఆవరణం బాగుపడుతుంది
వాతావరణం
మేఘమాలై కురుస్తుంది!

దుమ్మును వదిలించేదీ
ధూళిని కదిలించేదీ
పచ్చదనం పెంచేదీ
వర్షం కురిపించేదీ

మనుగడ నిచ్చేదీ
మనిషి బ్రతుకు పెంచేదీ
రోగం తగ్గించేదీ
రాగం పెంచేదీ

ఆకుపచ్చని ఆకుకాదా
ఆకసంలో చిగురుకాదా!

నరికితే నరకమే
పెంచితే స్వర్గమే
నా మనసులోంచి
ఒక రెమ్మ
నా హృదయం తేమతో
తళుకు బెళుకు లొలికిస్తే
చుట్టూ స్వర్గసీమ!

డా. మోపిదేవి విజయగోపాల్

ఆరోగ్యం



గుండెపోటు...అన్న మాట వినాలంటేనే భయం వేస్తుంది. అలాంటిది అది వచ్చిన వారి పరిస్థితి ఎలా వుంటుందో ఊహించుకోండి! అసలు గుండెపోటు ఎవరికి వస్తుంది? ఎందుకు వస్తుంది? ఎలా వస్తుంది? అన్న విషయాలను ఈ వారం తెల్సుకుందాం. మరి వివరాల్లోకి వెళదామా!

గుండెపోటు ఎవరికి ఎందుకు ఎలా వస్తుంది?

గుండెపోటును ముఖ్యంగా రెండు రకాలుగా గుర్తించవచ్చు. ఒకటి మయాకార్డియల్ ఇన్‌ఫార్కషన్. మరి రెండవది ఆంజైనా పెక్టరిస్. చాలా మందిలో ఇది కొన్ని సంకేతాలతో వస్తుంది. కొంతమందిలో ముఖ్యంగా మధుమేహ వ్యాధిగ్రస్థులలో ఏ సంకేతాలు లేకుండా వస్తుంది. దీనినే సైలెంట్ మయాకార్డియల్ ఇన్‌ఫార్కషన్ అంటారు.

కారణాలు

గుండెపోటు అంటే గుండె కండరాలకి రక్తాన్ని సరఫరా చేసే కరోనరీ ధమనుల్లో రక్తం గడ్డ కట్టినప్పుడు అది మరణానికి దారి తీస్తుంది. కరోనరీ ధమనులు అనేవి గుండె కండారాన్నుంచి శరీరానికి ఆక్సిజన్ సరఫరా చేస్తాయి. సిఎడి అనబడే ఈ జబ్బు... కొన్ని వాపునకు సంబంధించిన కణాలు, కొవ్వు పదార్థాలు కరోనరీ ధమనుల్లో పేరుకు పోవడం వలన వస్తుంది. ఈ పేరుకు పోవడాన్ని ప్లేక్స్ అంటారు. ఈ ప్లేక్స్ ఎక్కువ కాలం ఉంటే గుండె కండరం వత్తిడికి గురవుతుంది. దీనిని ఇస్కేమియా అంటారు. ఇది కూడా గుండెనొప్పి లేదా ఛాతీ అసౌకర్యానికి గురి చేస్తుంది. రక్త సరఫరా ఎప్పుడైతే 20 నిమిషాలనుంచి 40 నిమిషాల లోపు తిరిగి ప్రారంభం కాదో గుండె కండరం చనిపోతుంది. ఆరునుంచి ఎనిమిది గంటలలోపు ఈ హార్ట్ అటాక్ పూర్తి అవుతుంది.

డా.కెఎస్ఎస్.వెంకటేశ్వరరావు,
ప్రొఫెసర్ ఆఫ్ మెడిసిన్,
ప్రభుత్వ మెడికల్ కళాశాల,
తిరుపతి.
ఫోన్ నెం:9848745923

కరోనరీ అర్టరీ డిసీజ్ అనే ఈ జబ్బు పెరుగుదలకు చాలా అంశాలు దోహదపడతాయి.

1. రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయి సరిగ్గా లేకపోవడం అంటే ఎల్.డి.ఎల్ స్థాయి ఎక్కువగా ఉండడం, హెచ్.ఎల్.డి స్థాయి తక్కువగా ఉండడం. ఇంకా ట్రై గ్లిజరైడ్ పరిమాణం సమతూకంలో లేకపోవడం.

2. రక్తపోటు 140/90 కంటే ఎక్కువగా పెరగడం.

3. ధూమపానం రక్తనాళాలను గట్టిపడేలా చేస్తుంది.

4. మధుమేహ వ్యాధి

5. అధిక బరువు (ఇలాంటి వారిలో 20శాతం గుండె జబ్బులు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.)

6. వ్యాయామం లేకపోవడం(శారీరక వ్యాయామం లేని వారు మూడురెట్లు ఎక్కువగా ఈ వ్యాధికి గురి అవుతారు. క్రమం తప్పకుండా వ్యాయామం అవసరం.)

7. వయసు పెరుగుతున్న కొద్దీ సిఎడి అవకాశాలు పెరుగుతాయి.

8. జీవన శైలి జన్య అంశాలు కూడా ధమనులను గట్టి పరుస్తాయి.

9. కుటుంబ చరిత్ర ఉన్నప్పుడు ఈ వ్యాధి రావడానికి ఎక్కువ అవకాశం ఉంది.

10. రక్తంలో సి రియాక్టివ్ ప్రొటీన్ ఎక్కువగా ఉండటం.

11. రక్తంలో హేమోసిస్టిన్ అనే పదార్థం ఉండడం.

12. మానసిక ఒత్తిడి

గుండెపోటును నిర్ధారించడం ఎలా!

1. దాదాపు 90శాతం మంది రోగులలో గుండెపోటు రాగానే ఇసిజి అనే చాలా సర్వసాధారణమైన పరీక్ష చేస్తారు. ఎలక్ట్రోకార్డియా గ్రామ్(ఇసిజి), గుండెలోని ఎలక్ట్రికల్ ఆక్టివిటీని 12 ఎలక్ట్రోడుల ద్వారా నిర్ణయిస్తుంది. గుండె పోటుకు గురై దెబ్బతిన్న హృదయ కండరాలతో ఈ ఎలక్ట్రికల్ ఆక్టివిటీ మమూలు కన్నా తేడాగా ఉంటుంది. ఈ ఇసిజిని బట్టి గుండెపోటును నిర్ధారించి చికిత్స చేస్తారు.

2. ఛాతీ ఎక్స్‌రేలో గుండె పరిమాణం పెరిగినట్టు కాని, ఇయోర్టాలో కాల్షియం పేరుకుపోవడం కాని జరగవచ్చు.

3. ఎకో కార్డియా గ్రామ్ పరీక్ష ద్వారా గుండెపోటు వలన దెబ్బతిన్న హృదయ కండరాల సంకోచ, వ్యాకోచనలలో తేడా వస్తుంది. హృదయంలో ఉండే నాలుగు గదులు కూడా పెద్దవి కావడం గాని, హృదయ కండరాల పరిమాణం పెరగడం గాని జరగవచ్చు. గుండె గదులలో గూడు కట్టుకున్న రక్తం కూడా కొన్ని పరిస్థితులలో కనబడుతుంది.

4. గుండె కండరం అనారోగ్యం వల్ల రక్తంలో ట్రోపోనిన్, సిపికె, ఎల్‌డిహెచ్ ఆల్కలైన్ ఫాస్వటేస్ వంటి ఎంజైములు అధికంగా పెరుగుతాయి.

5. రేడియో ధార్మికత గల 'థాలయమ్' ద్వారా గుండెపోటుకు గురి అయిన కండరాల యొక్క సైజును మనం గుర్తించవచ్చు.

★

బొమ్మ కాదు! సీమరేగుపండు!!

నవనవలాడే సీమరేగుపండ్లు చూస్తే ఎవరికైనా నోరూరాల్సిందే. మరైతే వీటిని చూస్తే ఏమనిపిస్తోంది? చిన్ని చిన్ని బొమ్మనులకుంటే పొరపాటు పడ్డట్టే! ఎందుకంటే అవి మనం ఇష్టంగా తినే సీమరేగుపండ్లు. వీటి సృష్టికర్త ఎవరో కాదు! పొరుగునే వుంటాడు. అదేనండీ. పొరుగునే అంటే పక్కింట్లో అని కాదు. పొరుగుదేశమైన చైనాలో! పేరు జావో జియాంజ్‌హంగ్. ఈ రైతు హెక్సియా గ్రామవాసి. రేగుపండ్లను వివిధ ఆకారాలో పంపిస్తాడు. కాకపోతే వాటిని బుజ్జాయిలు, బుద్దుని ఆకారాల్లోకి రప్పించడానికి అతగాడికి ఆరేళ్లు పట్టింది. ఎన్నో ప్రయోగాల అనంతరం విజయం సాధించాడు. రేగుపండు పిందెగా వున్నప్పుడే తనకు కావాల్సిన ఆకారంలోకి పంపించేవాడు. అది పెరిగి పెద్దదై ఆ రూపును సంతరించుకుంటుంది. ఈ సీజన్‌లో ఇలాంటి పదివేల పండ్లను సృష్టించాడు. వాటిని బ్రిటన్, యూరప్‌కు ఎగుమతి చేయబోతున్నాడు. అంటే త్వరలో బ్రిటన్‌వాసులు బుద్దుని ఆకారకంలో వున్న సీమరేగుపండ్లను చూడబోతున్నారన్నమాట. ఒక్కో పండు ధర ఐదు పౌండ్లు పలకడంతో జావో గ్రామస్తులేకాకుండా హుబియా, ఉత్తర చైనాలోని వారు హఠాత్తుగా వివిధ ఆకృతులలో సీమరేగు పండ్లను పండించడం ప్రారంభించారు. ఇవి అత్యంత ఆకర్షణీయంగా ఉండడమేగాక, అదృష్టసూచికగా భావించడంతో చెట్టునుంచి కోసికోయగానే అమ్ముడుపోతున్నాయని హంగ్ చెప్తున్నాడు సంతోషంగా.



19వ బిడ్డ కోసం ....

ఈరోజుల్లో ఎవరినైనాసరే మీకెంతమంది పిల్లలు అనడిగితే ఒకరనో, ఇద్దరనో చెప్పడం సహజం. అయితే ఇదే ప్రశ్నను 'మిచెల్లీ' ని అడిగితే మాత్రం దీనికి భిన్నమైన సమాధానం వస్తుంది. అదేమంటారా? "ఇప్పటికి పద్దెనిమిది మంది పిల్లలు. త్వరలో పందొమ్మిదో బిడ్డకు జన్మనివ్వబోతున్నాను" అని. ప్రశ్న వేసినవాళ్లు ఏమాత్రం బలహీనంగా వున్నా కళ్లు తిరిగి పడిపోవడం ఖాయం. అయినా అదంతా ప్రశ్న అడిగినవాళ్ల స్టామినా మీద ఆధారపడి వుంటుందనుకోండి. సరే అసలు విషయానికొస్తే మిచెల్లీ (42) గత ఇరవైఒక్క సంవత్సరాలలో 18 మంది పిల్లలకు జన్మనిచ్చి 'సూపర్ మామ్' అని పేరు తెచ్చుకుంది. ఆమె ఇప్పుడు మళ్లీ గర్భవతట. వచ్చే మార్చిలో పంతొమ్మిదవ బిడ్డకు జన్మనివ్వనుంది. ఇంత మంది ఉన్నప్పటికీ మిచెల్లీ, ఆమె భర్త ఇంకా కొంతమంది పిల్లలకు జన్మనివ్వాలని కోరుకుంటున్నారు. పిల్లలుంటేనే వివాహబంధం బలీయంగా ఉంటుందని వారి నమ్మకం. అందుకే ఇ...లా....పందొమ్మిదవ బిడ్డకోసం కూడా... తొలి సంతానాన్ని పొందినప్పుడు ప్రదర్శించిన ఆతురతనే వ్యక్తంచేస్తున్నారు. ఎవరి ....వారికానందం అని సరిపెట్టుకోవడం తప్ప ఏం చేయలేం. ఏమంటారు?!





కురులతో కారు లాగగలరా!

'చేటంత గుమ్మడి కాయ కూడా కత్తిపీటకు లోకువ' అంటుంటారు కదా. చైనాలో ఓ అమ్ముడు చేసిన ఫీట్ చూసినవారు మాత్రం దాన్ని కాస్త మార్చి రాసుకోవచ్చంటున్నారు. తన కురులతో ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఆరు కార్లను లాగి బీజింగ్‌వాసులను అబ్బురపరిచింది. దీనికే కళ్లు తిరిగితే ఎలా? చెప్పుకోవాల్సింది చాలావుంది. కైఫెంజ్, హినాన్ రాష్ట్రాలలో ఇంతకంటే పెద్ద ఫీట్ చేసింది. తన వెంట్రుకలతో ఎనిమిది కార్లను 20 మీటర్ల దూరం వరకు లాగిందీనారి. ఇంతకీ ఈ బలశాలి ఎవరా అనుకుంటున్నారుకదూ. తనే ఝుంగ్ టింగ్‌టింగ్ (52). ఈమెది చైనాలోని కైఫెంజ్ నగరం. ఈమెకు మరో ప్రత్యేకత కూడా ఉంది. ఈమె కుంగ్‌ఫూ కూడా వచ్చు. 17 సంవత్సరాల వయసులో మార్షల్ ఆర్ట్ నేర్చుకున్న ఈమె కొన్ని దశాబ్దాలపాటు చైనాలో విస్తృతంగా ప్రదర్శనలు ఇచ్చింది. అయితే ఝుంగ్ రెండు సంవత్సరాల క్రితం గుండు చేయించుకుని సన్యాసినిగా మారింది. ప్రస్తుతం ఆమె జుట్టును స్థానిక మ్యూజియంలోగాని, టిబెట్‌లోని బౌద్ధారామంలోగాని పెట్టాలనే ఆలోచనలో వున్నారు అధికారులు.

తెలుసా!



సిగరెట్ పెట్టెలతో గిన్నిస్ రికార్డ్

ఒక్కొక్కరికి ఒక్కో అలవాటుంటుంది. కొందరు పెన్నులు పోగు చేస్తారు. ఇంకొందరు స్టాంపులు సేకరిస్తారు. దీన్నే ఇంగ్లీషులో హాబీ అంటారు. వాంగ్ గౌహాకు మాత్రం ఓ వింత అలవాటుంది. అదేంటంటే! ఆయన సిగరెట్ పెట్టెలను పోగుచేస్తాడు. అలా అలా ఇప్పటికి ఎన్ని సేకరించాడనుకుంటున్నారు! 30,000 సిగరెట్ బాక్సులు. పది దేశాల నుంచి వందకు పైగా కంపెనీల్లో తయారుచేసిన వాటిని సేకరించాడు. అయితే ప్రపంచంలోకల్లా ఎక్కువ మొత్తంలో సిగరెట్ బాక్సులను సేకరించిన వాడిగా గుర్తించమని కోరుకుంటూ గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారికి దరఖాస్తు పెట్టుకోవాలనుకుంటున్నాడు.

క్రైమ్ కథ

ఉచ్చు

- యర్నాగుల సుధాకరరావు

"రుద్రయ్యా నువ్వు విడుదలవుతున్నావు. అందుకే ఈరోజు నిన్ను అందరు ఖైదీల్లా పనిలోకి పంపలేదు. నీవు ఒకసారి చెప్పావు 'ఏరోజైనా విడుదలయితే చాలా సీక్రెట్‌గా నన్ను సాగనంపండి సార్' అని. ఆమాట గుర్తుకు వచ్చింది. ఇదిగో నీకు రావాల్సింది ఇస్తున్నాను. నీవు బయటికి పోయాక ఇక్కడ నీవు నేర్చుకున్న బుక్‌బైండింగ్‌తో జీవించు. మరి ఇలాంటి నేరాలు చేసి ఈకారాగారానికి రావద్దు" జైలర్ చెప్పాడు.

"మీరు నాకు మాత్రమే ఇప్పుడు చెబుతున్నారు. నాపై కత్తికట్టినవారి చెవికి ఎప్పుడో చేరిపోయింది. నేను ఇలా విడుదలైన మరుక్షణం నన్ను నరికి పోగులుపెడదామని బయటనే పొంచివున్నారు. నాకు రక్షణ కావాలి. నేను వెలుపలకి పోలేను" చెప్పి నేలమీద కూర్చుండిపోయాడు.

"వ్వాట్! నేను నీ విడుదలను నీ శత్రువులకు చేరవేశానా?"

"సాబ్ మీరు కాదు. ఇక్కడ స్టాఫ్ ఆపనిచేసింది..కావాలంటే జైలుకు అల్లంతదూరంలో ఒక వ్యాన్ ఉంది. అందులో కిరాయిగూండాలను నా పల్లెలో భూస్వామిగా ఉన్న రాయుడు ఏర్పాటు చేశాడు. వారు నన్ను రోడ్డుమీదే నరికి పారిపోతారు".

జైలర్ వెంటనే స్వయంగా వెళ్ళి వారికి అనుమానం రాకుండా చూసి వచ్చాడు.

"రుద్రయ్యా నువ్వు చెప్పింది నిజమే. అందు లో దాదా మస్తాన్ ఉన్నాడు. నీవన్నట్టు వాడు ఖూనీకోరే. సరే ఇవన్నీ ఈ నాలుగు గోడలమధ్యనే ఉండి ఎలా తెలుసుకున్నావు" జైలర్ ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు.

"సాబ్ నేను పదిపల్లెలమీద పెత్తనం చేసే పులిరాజు అనే ఒక రాక్షసుడిని కడతేర్చి ఈ ఎనిమిదేళ్ల జైలు జీవితం గడిపాను. ఒక్క సెలవు తీసుకోకుండా ఇక్కడ ఇనుపచువ్వల వెనుకనే ఉన్నాను. నాకు రెండుమూడుసార్లు పెరోల్ అవకాశం వచ్చినా వాడుకోలేదు. నన్ను చంపాలని నాప్రత్యర్థివర్గం యోచన. వారు నాకోసం సప్తసముద్రాల ఆవలకైనా మారణాయుధాలతో వస్తారు"

"రుద్రయ్యా! ఈరోజు కాకపోయినా మరోరోజైనా నీవు విడుదలై మీగ్రామం చేరాల్సిందే కదా! లేకుంటే వేరే ఎక్కడికైనా పోతావా?"

"డబ్బుంటే తప్ప ఇతరచోటుల్లో నావంటి ఫ్యాక్షనిస్టులు రాణిం చలేరు. నేనా ధనికుడను



కాను. ఏంచేయాలో తెలియకుండా ఉంది. మృత్యువు కోరలు చాచుకుని ఉంది" రుద్రయ్య నేలమీద వేలితో గీస్తూ బదులిచ్చాడు.

జైలర్ పైఅధికారులతో మాట్లాడి రుద్రయ్య విడుదలను ఆరోజు లేకుండా మరికొన్నిరోజులు పొడిగించాడు.ఒకవారంరోజులు గడిచాయి. మరలా విడుదలకు జైలు అధికారులు సిద్ధపడ్డారు.

"రుద్రయ్యా ఈరోజు విడుదల కాబోతున్నావు. ఈసారి ఎవరికీ తెలియకుండా జాగ్రత్తపడ్డాం. నిన్ను పోలీస్‌జీపులో ఎక్కడకి కావాలంటే అక్కడే వదిలేస్తాం" జైలర్ లోగొంతుతో చెప్పాడు.

"సాబ్ ఇదే ఇక్కడ జరుగుతున్న తప్పు. నాకు మాత్రమే నా విడుదలకు ముందు చెబుతున్నారు. నన్ను చంపేవాళ్లకు నావిడుదల ఏక్షణ మన్నది తెలిసిపోతోంది. ఈవారం రోజులుగా జైలురోడ్డులో కన్పించని నన్ను వధించేందుకు శత్రువులు ఏర్పాటు చేసిన వాహనం ... ఈరోజు మళ్లీ ప్రత్యక్షమయ్యింది. ఈసారి అందులో ఉండేది మస్తాన్ కాదు. వేరే దాదా ఢిల్లీరావున్నాడు. నేను ఈరోజు పోలేను. నేను నిరాయుధుడను. వెళ్లలేను."

జైలర్‌కు నోట మాట రాలేదు. బయటికి వెళ్లి వచ్చి "యస్! నీవు చెప్పింది కరెక్ట్. ఆవాహనంలో దాదాఢిల్లీరావున్నాడు. ఎక్కడో గ్రామాల్లో ఉండే మీకు ఇంతేసి నెట్‌వర్కు ఉండడం దానికి తగ్గట్టు ఖూనీలు చేయడానికి దాదాలను, గూండాలను నియమించడం ఏమిటి మీరు చేస్తున్నది. తలచుకుంటే భయమేస్తోంది. మరోసారి వాయిదా వేస్తాను నీ విడుదల" చెప్పి పైఅధికారులతో మాట్లాడాడు.

మరోవారం గడిచాక అర్ధరాత్రివేళ నిద్రపోతున్న రుద్రయ్యను తట్టిలేపాడు జైలర్. "పదవయ్యా నాడ్యూటీ రాత్రి పడింది. నిన్ను ఈరాత్రి విడుదల చేస్తాను. నిన్ను రైల్వేస్టేషన్‌లో వదిలేయనా? అధికారు లకుగాని ఇక్కడ స్టాఫ్‌కిగాని చెప్పకుండా నేను ఈపనిచేస్తాను" లోగొంతుతో చెప్పాడు.

రుద్రయ్య నవ్వేశాడు. "తప్పకుండా నేను ఈరాత్రి విడుదల కావల్సిందే సాబ్. మాపదిపల్లెలకు నాచేతుల్లో హతమైన పులిరాజు పీడ వదిలిందని సంబరపడ్డారు. ఇప్పుడు వాడి తమ్ముడు ఎర్రన్న పీడ ఎక్కువగా ఉందని వాడు మరింత కఠినంగా ఉన్నాడని తెలుస్తోంది. వాడు రచ్చబండవద్ద నాగురించి ప్రమాణం చేశాడట. అన్నను చంపిన రుద్రయ్యను చంపందే చచ్చేది లేదని వాగాడట. వాడే నా గురించి ఇన్నాళ్ల వెతుకుతున్నాడు"

ఇద్దరూ కలిసి జీపు ఎక్కారు. నిర్మానుష్యంగా ఉన్న రోడ్లమీద స్పీడుగా పోతోంది. నీ విడుదల వారంక్రితమే రికార్డుల్లో చూపేసాం..." అని జైలర్ చెబుతుండగా "సార్ ఇక్కడే జీపు ఆపి ఇరవై నిముషాలు వెయిట్ చేయండి. ఆలాడ్జిలో నాకో మిత్రుడున్నాడు. వాడిని కలిసి వస్తాను. చెప్పి కిందకు గెంతి చీకట్లో పరుగెత్తాడు. సరిగ్గా ఇరవై నిముషాలకు వచ్చాడు. అతడు కిందపడినట్టు దుస్తులకు అంటుకున్న మట్టి చెబుతోంది. జైలర్ అడగబోతుంటే రెండునోట్ల కట్టలు అందించాడు. నాకోసం ఇంతచేసిన మీకు ఇంతకంటే ఏమివ్వగలను. చెప్పానుగా నాఫ్రెండును కలుసుకున్నానని"

జైలర్‌కు నోట్లకట్టలు చూశాక నోట మాట రాలేదు. జీపును పోనిచ్చాడు. రుద్రయ్య రైల్వేస్టేషన్‌లో దిగేశాడు.

ఆమరుసటిరోజు ఉదయాన్నే జైలర్ టీవీ ఆన్‌చేశాడు. లాడ్జిలో ఎర్రన్న హత్య గురించిన వార్తను గుడ్లప్పగించి చూశాడు. హంతకుడు రుద్రయ్యేనని పోలీసులు అనుమానిస్తున్నారు.ఏదో కోర్టుపనిమీద వచ్చిన ఎర్రన్న లాడ్జిగదిలో నిద్రపోతుండగా బయట అతడి మురావాళ్ల పహరాలో నిద్రపోతున్నప్పుడు ఈహత్య జరిగింది.హంతకుడు వెంటిలేటర్ లోంచి లోపలకి పోయి ఈహత్యకు పాల్పడ్డాడు.

జైలర్ దారాెత్తిపోయాడు. "రుద్రయ్యా! జైల్లో ఉంటూ ఎర్రన్న హత్యకు పథకం వేసి సాధించావంటే నీవు సామాన్యుడవు కావు. నీ మాటలు నమ్మి నీఉచ్చులో పడ్డాను. రేపు అధికారులు అడిగితే ఏం చెప్పాలి?" అని తల పట్టుకుంటుండగా ఫోన్ మోగింది. కాలర్‌లో చూశాడు. పైఅధికారి ఫోన్.......... ఉచ్చులో చిక్కాను అని అనుకుంటూ ఆన్‌చేశాడు.

★

కథ



ముట్టుకొన్నాడు

అనువాదం : రంగనాథ రామచంద్రరావు

కన్నడ మూలం: పి. లంకేష్

బసలింగడికి అది తీరుబడి లేని కాలం. దున్నడం నాల్గురోజులు ఆలస్యం చేస్తే విత్తు నేలలో నాటుకోదు. కానీ వున్న రెండెద్దుల్లో ఒకటి కాడిమాను పెట్టగానే పడిపోతుంది. ఎంత కొట్టినా లేవదు. ఇంకొకటి కూడా తన సహోద్యోగిలానే మారిపోయే సూచనలున్నాయి. ఒక్కవేటు వెయ్యగానే పడుకున్నది లేస్తుంది. జతగాడు లేవడం కోసం ఎదురు చూస్తూ పనిలేక పోవడం పట్ల ఆనందిస్తున్నట్లు కనిపిస్తుంది. అందువల్ల బసలింగడు రెండెద్లను ఎవరో ఒకరికి మారు బేరానికి ఇచ్చేసి కొత్త ఎడ్లను తెచ్చుకోవాలనుకున్నాడు. బిడ్డకి ఒంట్లో బాగులేదు. శివనూరు స్వామి వారికి చూపించాలని పెళ్ళాం సిద్లింగి చెబుతూనే వుంది. బిడ్డకి దగ్గు తగ్గటం లేదు. ఈ మధ్య బసలింగడికి మరో ఇబ్బంది కలిగింది. ఈ ఇబ్బంది తన్నింతగా హింసిస్తుందని బసలింగడు వూహించలేదు. తన ఎద్దుల్ని మారు బేరమాడడానికి చెప్పాల్సిన అబద్ధాలు అతడి తల తినేస్తున్నాయి అబద్ధం చెప్పడానికి కావలసిన ధైర్యం, మాటకారితనం అతడిలో లేవు. ఎడ్ల గురించి చెప్పాల్సిన మంచిగుణాలను లెక్కవేసినట్టల్లా అతడి తల వేడెక్కిపోయేది. అదెలావున్నా ఈ నడుమ బసలింగడి ఎడమ కంట్లో అగుపించని నొప్పి రాను రాను పెరుగుతూ పోయింది.

మొట్టమొదట్లో అది కంటి నొప్పి అయ్యుండొచ్చనుకున్నాడు. కానీ, కన్ను ఎర్రబడలేదు. కంటి చుట్టూ నొప్పి మాత్రం పెరిగింది. ఈ నొప్పి వల్ల కుడి కంట్లో కాదు. ఎడమ కన్ను కాస్త మందగించినట్లు అనిపించసాగింది. భయం మొదలయింది. తను మామూలుగా చూపించుకునే పట్నం డాక్టరుకే చూపించాడు. ఆయన నొప్పి గురించి వివరాలన్ని అడిగి రెప్పలు విడిదీసి చూశాడు. ఆయనకు అర్థంకాకపోయినా బసలింగడికి ధైర్యం కలిగించడానికి మంచి మంచి మాటలు చెప్పారు. తమ వైద్య సంబంధ మహిమల్ని వివరించారు. పూసుకోవాడనికి ఒక లేపనం ఇచ్చారు. కాస్త వూరటతో ఇంటికొచ్చిన బసలింగడు కొద్ది రోజుల లేపనం పూసుకొని వైద్యుడు చెప్పినట్టు గుడ్డకాపు, ఉప్పుకాపు పెట్టుకున్నాడు. కాని కంటి నొప్పి, మందగింపూ తగ్గలేదు. ఆ విషయం చెబితే పెళ్ళాం సిద్లింగి నమ్మలేదు. అది అతని భ్రమ అన్నట్లు మాట్లాడింది. బసలింగడికి కోపమొచ్చింది. ఓ విధమైన నిస్సహాయత మొదలయ్యింది. నొప్పి గురించి మామూలుగా చెప్పకుండా కొందరి ముందు తన కష్టాలు వెళ్ళబోసుకున్నాడు. సాగు చేయని భూమి, బిడ్డ జబ్బు అన్నీ అతడికి ముఖ్యం కానట్లు కనిపించసాగాయి. ప్రభుత్వ అసుపత్రి డాక్టరు తిమ్మప్పకు చూపించమని ఎవరో సలహాయిచ్చారు. ప్రభుత్వాసుపత్రి అంటే దిక్కు మొక్కు లేని వాళ్ళు వెళ్ళే చోటని తెలిసిన అతడికి ఇది చివరి ప్రయత్నంగా కనిపించింది. అయితే అతడికి తిమ్మప్ప గురించి చెప్పిన వాళ్ళు ధైర్యం చెప్పారు. ప్రైవేటు డాక్టర్లు కూడా ఎంత చెడ్డవాళ్ళో వివరించారు.

> **మళ్ళీ నొప్పి మొదలయ్యింది. ఇప్పుడు బసలింగడు బాధకు, పశ్చాత్తాపానికి చిక్కుకున్నాడు. అబద్ధం చెప్పలేని బసలింగడు ఒక వారంలోగా తిమ్మప్పగారి మినహాయించి ఇతర డాక్టర్లందరికీ తన కన్ను చూపించసాగాడు,**

డాక్టరు తిమ్మప్పగారు తీరిక లేని వైద్యులు. వారి చికిత్సాలయంలో పది, పన్నెండు మంది వరుసలో నుంచున్నారు. అందరు పేదవాళ్ళు. బసలింగడు కాచుక్కూర్చున్నాడు. తన వంతు రాగానే తిమ్మప్పగారి ముందు నుంచోని తన కష్టాలను వెళ్ళబోసుకున్నాడు. కూలబడి పోయే తన ఎద్దుల నుంచి మొదలు పెట్టి తన బాధ, తన నిద్రను, నెమ్మదిని పాడుచేయడం గురించి చెప్పాడు. తిమ్మప్ప అతడ్ని పరీక్షించాడు. నొప్పికిగల కారణం కోసం వెదికారు. చివరగా ఇలా అన్నారు " నీ కన్ను బాగవుతుంది అయితే ఆపరేషన్ చేయాలి. ఫరవాలేదా?"

ఖచ్చితంగా బాగవుతుందా అన్నట్లు బసలింగడు చూశాడు.

తిమ్మప్ప విశ్వాసంతో మాట్లాడాడు. బసలింగడు ఇదంతా మనసులోనే దాచుకున్నాడు. సిద్లింగి అడిగినపుడు డాక్టరు పేరు మాత్రం చెప్పాడు. వివరాలు తెలిపే ఉత్సాహం అతడిలో లేదు. మరుసటి రోజు పశువుల కొట్టు, పెరడు, నీళ్ళు, నిప్పు పనులన్నీ ముగించుకొని ఆసుపత్రికి బయలుదేరాడు. తిమ్మప్పగారు ఎంత మంచివారంటే ఆయన అతడి కోసమే ఎదురు చూస్తున్నాట్టు వున్నారు. బసలింగడి పట్ల ఆయనకు అమితమైన ఆసక్తి, ప్రేమ, ఏర్పడ్డాయి. అతడి పొలం, ఎద్దులు, బిడ్డ కూడా ఆయన మనసులో నిలిచిపోయాయి. అనుభవంగల వైద్యుడైన తిమ్మప్ప, బసలింగణ్ణి ఆపరేషన్‌కు సిద్ధం చేసి కొద్ది నిమిషాల్లోనే ఆపరేషన్ పూర్తి చేశారు. ఆ తరువాత అతని చేయి పట్టుకొని అన్నారు.

'చూడూ' ఇది సున్నితమైన ఆపరేషన్, రెండు వారాలు నీవు తలకు నీళ్ళను తాకనివ్వకూడదు. నీళ్ళు పడితే కన్ను పాడైపోయే ప్రమాదం వుంది ఇది బాగా గుర్తుపెట్టుకో.

బసలింగడిలోనూ తిమ్మప్పగారి పట్ల విచిత్రమైన ప్రేమ పెరిగింది. అయితే అతను ఇంటికి వెళ్ళాక సిద్లింగి పెద్ద గొడవే చేసింది. ఆమెకు ఎలాగో తిమ్మప్ప శూద్రుడని తెలిసింది. తనకే తెలియని విషయం ఆమెకెలా తెలిసిందోనని ఆశ్చర్యపోయాడు. తనకూ, తిమ్మప్పకూ మధ్య సంబంధం అతడికి మరో అచ్చులో పోసినట్టు కనిపించసాగింది. తనను ముట్టక ముందు ఆయన తన కులాన్ని గూర్చి ఒక్కమాట చెప్పివుంటే బాగుండేదని ఓ క్షణం అనిపించింది. కానీ అలాంటి ఆలోచన మంచిదికాదని తిట్టుకున్నాడు. తన వ్యక్తిత్వంలో ఏదో లోపించినట్లు బసలింగడికి అనిపించింది. అందుకు నొచ్చుకున్నాడు. ఈ విషయం ఎవరికీ చెప్పకూడదని నిర్ణయించుకున్నాడు. సిద్లింగి కూడా దీనికి ఒప్పుకుంది. సూతకం పోగొట్టుకోడానికి బసలింగడు స్నానం చేయాలి. తిమ్మప్పగారి సలహాను మరవకపోయినా అది అస్పష్టం కాసాగింది. సిద్లింగి అతడి కన్ను మాత్రం తడవకుండా వేడి వేడి నీళ్ళు పోసి స్నానం చేయించింది.

మనసు తేలిక పడినా కట్టులో సురక్షితంగా వున్న ఎడమ రెండు రోజులు నొప్పి నుంచి ఉపశమనం పొంది మూడవ రోజు నుంచి సలుపసాగింది. మళ్ళీ నొప్పి మొదలయ్యింది. ఇప్పుడు బసలింగడు బాధకు, పశ్చాత్తాపానికి చిక్కుకున్నాడు. అబద్ధం చెప్పలేని బసలింగడు ఒక వారంలోగా తిమ్మప్పగారి మినహాయించి ఇతర డాక్టర్లందరికీ తన కన్ను చూపించసాగాడు, జరిగింది చెప్పాడు. వాళ్ళిచ్చిన సలహాలు మందులు సరిపోనేలేదు. మరోదారి కనిపించక తిమ్మప్పగారి దగ్గరికే వెళ్ళాడు. ఆయన అతడ్ని ప్రేమగా ప్రశ్నించసాగాడు. బసలింగడు జవాబిచ్చాడు. తాను తన తలకు నీళ్ళ తాకను తాకనివ్వలేదని అబద్ధం చెప్పాడు. *అతడు వణుకుతూ వుండటం* చూసిన తిమ్మప్ప తమకు అనిపించింది చెప్పారు. తను చెప్పిన అబద్ధం డాక్టరుకు తెలిసిపోవడం గమనించిన బసలింగడూ కలవరపడ్డాడు. "బసలింగా నీవు చాలా మంచివాడివి. జరిగింది జరిగినట్లు చెప్పు" అని తిమ్మప్ప నెమ్మదిగా అడిగారు.

బసలింగడు కొయ్యబారి పోసాగాడు. అబద్ధం చెప్పిన బసలింగడు ఇప్పుడు యాంత్రికంగా జరిగిందంతా చెప్పాడు. అంతా చెప్పాక తన గుండె బరువు దిగినట్టు వూరకే మౌనంగా కూర్చున్నాడు.

"ఎలాగైన నాకు మరోసారి ఆపరేషన్ చేయండి. మీ మాటా మీరను" అన్నాడు.

తిమ్మప్ప తల తిప్పుకున్నారు. మరో ఆపరేషన్ వల్ల ఏమి జరగదని అన్నారు. "ఇప్పుడు అయిన గాయానికి మందిస్తాను తప్పకుండా పూసుకో " అని అన్నాడు.

అదెందుకో బసలింగడికి కోపం వచ్చింది. తన జాతిని మైలపరిచిన తిమ్మప్ప తన పట్ల నిర్లక్ష్యం పెంచుకుంటున్నట్టుగా అనిపించసాగింది. తన కన్ను పోవడానికి ఏదో విధంగా తిమ్మప్ప కారకులైనట్టు భావించాడు. జరిగినదంతా తాను తెలిసినవారితో చెప్పుకుని తిమ్మప్పగారిని నిందించాడు. వారిలోనూ తిమ్మప్ప పట్ల కోపం వచ్చేలా విషయాలను మార్చి చెప్పాడు. అలా చెబుతూ పోతున్న కొద్దీ తాను మార్చి చెబుతున్నదే వాస్తవమని నమ్మాడు. ఒక్కొక్కసారి రోజంతా ఏమీ అర్థంకాని వాడిలా కూర్చునేవాడు. తనలో పెరుగుతున్న అల్పత్వానికి ఆశ్చర్యపోయేవాడు. ఇది ఎడ్ల మారకానికి అనుకూలం కావచ్చు. అబద్ధం తన కుటుంబానికి సహాయపడొచ్చు. భార్య సిద్లింగిలో మాట్లాడేటప్పుడు ఎక్కువ సంతోషం అతడి గొంతులో కనిపించింది. బడాయిగా మాట్లాడడాన్ని నేర్చుకోవాలనిపించింది. సాగు చేయడం ఆలస్యమైదే అప్పు చేసి బతకటానికి కూడా బడాయితనం సహాయకారి.

అయితే బసలింగడికి కష్టం ఆ దిశలో రాలేదు. తన ఎడమ కన్ను పూర్తిగా కనిపించకుండా పోయి, నొప్పి తగ్గిపోతున్నట్టే కుడికంటిలో నొప్పి కనిపించింది. ఎడమ కంటిలో నొప్పి మొదలైనప్పటి



అతడిలోని ముగ్ధత మళ్ళీ మనస్సును ఆక్రమించసాగింది. ఈసారి ఎక్కువ చురుకుగా వుండగల గుండెనిబ్బరం కలిగి వుండటం వల్ల చాలామంది డాక్టర్లను కలిశాడు, తనకు తెలిసిన లింగాయత జాతికి చెందిన రాజకీయనాయకుడు రుద్రప్పను తోడు తీసుకుని డాక్టర్ల దగ్గరకు తిరిగాడు. కొందరు డాక్టర్లు "దీనికి ఆపరేషనే అవసరం లేదు. ఆ తిమ్మప్ప డాక్టరుకు బుద్ధిలేదు. అందుకే దీనికి ఆపరేషన్ చేశారు" అని చెప్పారు. మందులిచ్చి ధైర్యం చెప్పారు. అయినా బసలింగడి నొప్పి తగ్గలేదు భయం పోలేదు. ఈ కంటి జబ్బుకు మందు ఉండనే వుంటుందని నమ్మిన బసలింగడు చుట్టుప్రక్కల వున్న డాక్టర్లందరినీ చూశాడు. చివరికి తన డాంబికపు ధోరణిలోనే తిమ్మప్పగారిని కలిశాడు. తిమ్మప్ప తన రోగిలో వచ్చిన మార్పును గమనించారు.

బసలింగడి గొంతు పెద్దదయింది. అతడు తనకు తెలియకుండానే అల్పుడవసాగాడు. అతడి రోగం శారీరక స్థాయినుంచి మానసిక స్థాయిని చేరసాగింది.

తిమ్మప్ప బాధతోటే – "బసలింగప్పా! నేను నిన్ను ముట్టుకున్నది డాక్టరుగా. అయితే నీలాంటి అమాయకపు మనిషిలో కూడా ఈ 'ముట్టడం' నేను వూహించని మార్పును తెచ్చింది. అది నీ తప్పుకాదు. ఇందుకోసం నేను ఎవరినీ దూషించను. నీవు ఈ సారి ఒక పని చెయ్యి. నా పేరు చెప్పి డాక్టరు చంద్రప్పగారిని కలుసుకో. వారు నాలా మంచి డాక్టరే. ఏమీ అనుకోవద్దు" – అని అన్నారు.

అప్పటికీ బసలింగడు, డాక్టరు తిమ్మప్పగారిని ద్వేషించనప్పటికీ వారి పట్ల ఒక విధమైన కసి పెరిగింది. తాను వారి పట్ల, వారి జాతి గురించి మాట్లాడినదంతా వారికి తెలిసి వుండొచ్చుననే భయం మూర్ఖత్వమై గర్వంగా మారింది. అతను తిమ్మప్ప గారి నుంచి బయటకు రాగానే రాజకీయ నాయకుడైన రుద్రప్పను అడిగి చంద్రప్ప కులం తెలుసుకున్నాడు. తిమ్మప్ప కులమంత నీచమైంది కాదని తెలుసుకొని కుదుటపడ్డాడు. వెంటనే వెళ్ళి డాక్టరు చంద్రప్పగారిని కలిశాడు.

అక్కడ బసలింగడు ఎదురు చూడనిది ఎదురైె బసలింగడి ఎడమ కంటి పూర్తి చరిత్రను, బసలింగడి డొంకతిరుగుడు మాటల్లో విన్న చంద్రప్ప – " డాక్టరు తిమ్మప్ప గారి వల్ల కాని పని నాలాంటివారి వల్ల సాధ్యం కాదు. మా వైద్యప్రపంచానికి తెలిసిన అత్యంత ప్రామాణికమైన ప్రతిభావంతుడైన డాక్టరు తిమ్మప్పగారు. ఈ కంటి జబ్బు వారి శాఖకు చెందింది. నీవు వారిని సంప్రదిస్తేనే వున్న ఆ ఒక్క కన్నైనా దక్కుతుంది" అని అన్నారు.

రాజకీయ నాయకుడైన రుద్రప్పతో పాటు బసలింగడు బయటికొచ్చాడు. ఎండలో తల మీద చేతులు పెట్టుకొని కూర్చున్నాడు. ఎవరు మాట్లాడించినా మాట్లాడలేదు. భార్య మాటలు చెవిన పడలేకపోయాయి. కుడికంటి నొప్పి భయంకరంగా వుంది. రానూ రానూ దృష్టి మందగించటం బసలింగడికి అర్థమయ్యింది. తన బడాయి, అబద్ధాలు, జాతి, మరపు గురువులు – ఎవరూ తన కంటిని మిగల్చలేరన్నది నిశ్చయమవసాగింది. నొప్పి శారీరక బాధను అధికమించిన నొప్పి అతడ్ని కమ్ముకుంది. డాక్టరు తిమ్మప్పగారి మెరుపులాంటి వేళ్ళు, అభిమానపూరిత ముఖం గుర్తొచ్చాయి. తన పొలం, తన ఎద్దులు, తన మాగాణి వారనవున్న మామిడి చెట్టు, పారిజాతం పువ్వులు..

నేరుగా తిమ్మప్పదగ్గరికి వెళ్ళాడు. నొప్పెడుతున్న కుడికన్ను కన్నీళ్ళను కారుస్తోంది. తిమ్మప్పగారి చేతులు పట్టుకున్నాడు. వారిని కౌగిలించుకుని బిగ్గరగా ఏడ్వసాగడు. తిమ్మప్పగారు చలించలేదు. తలను నిమరలేదు కూడా. కాస్త కుదుటపడ్డాక బసలింగడు ఏమేమో వాగాడు. అది అతడికి తిమ్మప్పగారికి మాత్రమే అర్థమయ్యేలా వుంది.

<u>ఎదురుగా కూర్చున్న బసలింగడిని తిమ్మప్ప రెప్ప వేయకుండా చూశాడు. అతడ్ని తాను ఇష్టపడటానికి కారణమేమిటని ఆలోచించారు. అది అతనిలో ఒకప్పుడు ఉండి ఇప్పుడు మళ్ళీ చిగుర్చిన 'అమాయకత' కావచ్చు.</u> అతడిని చూస్తే అతని కులం ఏదయివుండొచ్చనే ప్రశ్న కూడా తనలో కలగకపోవడం కావచ్చు. మనిషి బాధకు, మనిషి తాపత్రయానికి, మనిషికి సాధ్యమయ్యే అల్పత్వానికి, మంచితనానికి సాక్షిగా కనిపించటం కావచ్చు. బసలింగడు వారి నిశ్చల దృష్టిని చూస్తూనే వున్నాడు. తిమ్మప్పగారి కళ్ళు తడి తేరసాగాయి. అది కన్నీటిగా మారటానికి మునుపే అన్నారు.

"ఈసారి తలకు నీరు తగలనివ్వకూడదు. ఈ కన్ను బాగవుతుంది" – అని మాత్రమే చెప్పి శస్త్ర చికిత్సకు సిద్ధం చేసుకోసాగారు.

అబద్ధాల నుంచి విముక్తుడైన బసలింగడు చిన్నపిల్లవాడిలా వారి కదలికలు చూస్తూ కూర్చున్నాడు.

★

కొత్త పుస్తకాలు

కథా నిర్మాణదిగ్గజం - మధురాంతకం



మధురాంతకం రాజారాం
కథలు - 4
పేజీలు : 376, వెల : 150/-.
ప్రతులకు :
విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.

కథా రచయితలకు పుస్తక జ్ఞానం, లోకజ్ఞానం తప్పనిసరి. ఈ జోడు గుర్రాలమీద స్వారీ చేయవలసిందే. కేవలం పుస్తక పఠనం మీదనే ఆధారపడితే ఓ సిద్ధాంతవేత్తగానో, మేధావిగానో మిగిలిపోయే పరిమితి ఏర్పడుతుంది. కేవలం తన అనుభవంలోకి వచ్చిన ప్రత్యక్ష జ్ఞానంతోటే సంతుష్టి చెందితే సామాజిక పరిణామం, దూరదృష్టి అలవడక చతికిలబడిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. దిశా నిర్దేశం లేకపోతే కర్తవ్యం బోధపడదు కదా?

పుస్తక జ్ఞానంలో ఇప్పుడు ఎలక్ట్రానిక్ మీడియా, సినిమా, టీవీ, ఇంటర్నెట్ కూడా చేర్చవచ్చు. లోక జ్ఞానానికి అనుభూతి శక్తి ప్రధానం. రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక జీవిత పార్శ్వాలన్నీ అర్థం చేసుకోవాలి. ఓ విధంగా జీవితాలను కాచి వడపోయాలి.

కీ.శే. మధురాంతకం రాజారాం అలాంటి ఉభయ జ్ఞాన సంపన్నులు. అందుకే మన తెలుగు కథను సుసంపన్నం చేసిన అగ్రగణ్యుల సరసన ఆయన నిలిచారు.

మధురం సృష్టించడం సామాన్యం కాదు. రుచులనుగాని, రసాలను గాని, సమపాళ్ళలో సరైన సమయంలో కలబోసి రంగరించి అందించినపుడు అది అపురూపంగా మిగిలిపోతుంది. కలకాలం గుర్తుండిపోతుంది.

మధురాంతకం కథలు ఆ విధంగా మధురమే. నిజంగా ఆణిముత్యాలు. దాదాపు అర్ధశతాబ్దం తన రచనా వ్యాసంగంతో 300 కు పైగా కథలు, పలు నవలలు, నాటకాలు, ఎన్నో వ్యాసాలు రాశారు. కేంద్ర, రాష్ట్ర సాహిత్య అవార్డులతో పాటు శ్రీ కృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్‌ను పొందారు.

“సాధన చేయడం మాత్రమే కళాకారుడి వంతు. సాహిత్య వ్యాసంగానికి పూనుకున్న నాటినుండి నేను నిర్విరామంగా కథా రచనలో కృషి చేస్తున్నానని మాత్రం చెప్పుకోగలను. ఏ కళా సాధనలోనైనా సాధించగలిగే దానికన్నా సాధించవలసిందే ఎక్కువగా మిగిలి ఉంటుంది. అయితే అనుభవ పరిధిలోకి వచ్చిన సమస్త విషయాలను సాహిత్య నిబద్ధం చేయడానికి ప్రయత్నించాను” అని తెలిపిన స్వీయ నివేదనలో నిబద్ధత వినమ్రతే కాదు, ఓ ప్రజా రచయిత కర్తవ్యం కూడా అవగతమవుతోంది.

మధురాంతకం రాజారాం నాల్గవ సంపుటిలో 42 కథలు ఉన్నాయి. కథలన్నీ వైవిధ్య భరితమే.

పాఠకుడ్ని కథల్లోకి లాక్కుపోవడం, పాత్రలకు ప్రాణ ప్రతిష్ఠ చేయడం, పాఠకులు కూడా ఆ పాత్రల్లో ఒకరిగా కలిసిపోయి ఆ సంఘటనను, సన్నివేశాన్ని అతి దగ్గరగా చూస్తున్నట్టు వీక్ష బంధన చేయడం, తర్వాత ఏం జరుగుతుందా అనే ఉత్సుకత కలగించడం, ఊహించని మలుపుతో ముగింపుతో విస్తుపోయేటట్లు చేయడం, చివరకు ఔచిత్యమయిన నామకరణ చేయడం - ఇవన్నీ కథా నిర్మాణంలో భాగమేనని తెలిసినప్పటికీ అన్ని వైపులనుండి ఏకకాలంలో పగ్గాలను వడిసి పట్టుకొని రథాన్ని నడిపే సారథిగా సాక్షాత్కరిస్తాడు ఇక్కడ రచయిత.

“అంతా దైవ నిర్ణయమనుకొంటూ, బాధ్యతలను గాలికి వదిలిపెట్టి ఎలా వీలైతే అలా కాలం గడపదలచుకొన్న పురుషుడు, సంసారాన్ని సరిదిద్దడానికి సర్వశక్తులను ధారపోస్తున్న స్త్రీ, ఆ ఇద్దరి నడుమ జరుగుతున్న నాట్యరంగమే నరసయ్యగారి ఇల్లు”. ఆ ఇంటి పెద్దలకు (మగవాళ్ళకి) సుష్టుగా తిని తేన్చుతూ వెలుపలికి రావడమొక్కటే తెలుసు. పిల్లలకు ఏ మాత్రం మిగిలిందో వాళ్ళు తింటున్నారో తెలియదు. పెద్దబ్బాయికి ఇరవైఏళ్ళ వయసులోనే పెళ్ళి జరిగింది. బిడ్డల్ని కనడానికి, బండెడు చాకిరీ చేయడానికి శాశ్వతంగా ఒక మనిషి దొరికింది అనుకొన్నారే గానీ, ఆ మనిషికీ మనసుందని, ఆమనసుకు కూడా ఇష్టాఇష్టాలుంటాయని పెద్దబ్బాయి కలలో కూడా భావించలేదు (వెలుగు సముద్రంలో చీకటి దీవి- 1960).

అనేక కుటుంబాల్లో తరతరాలుగా జరుగుతున్న జీవిత సత్యాన్ని ఇక్కడ ఓ కథలో బంధించారు.

ఆ ఊళ్ళో బడి ఎక్కడ ఉంటుందో తెలుసుకోవాలని అన్వేషించే ఓ మాష్టారుకు ఎదురైన పెత్తందారీ కుటుంబం ఇది. పాపం గంపెడు పిల్లల్ని కన్న ఓ తల్లి అంటుంది మాస్టారుతో “పిల్లల మాటలకేం గానీ మీరా ఏభైఏడో దేశంలోకి ఎందుకు వచ్చిపడ్డారండీ మాస్టారు. మరెక్కడా దొరకలేదా ఉద్యోగం! (ఏభైఏడో దేశం అనేమాట ఇక్కడ ఓ జాతీయం. మన తెలుగు వర్ణమాల 56 అక్షరాలు గనుక ఏభైఏడో దేశం జాతీయం అయిందా?) ఇలాంటి పద ప్రయోగాలు, జాతీయాలు మెరుపుల్లా కథల్లోకి వచ్చి పాఠకుల ఆలోచనకు పదునుపెడ్తాయి.

ఇంకో విశేషమేమంటే మనకు కథల్లో ఎక్కడా కక్ష, కార్పణ్యం, పగ, ప్రతీకారంతో కూడిన హింసోన్మత్తమైన దుష్ట ప్రతినాయక పాత్రలు కాదుకదా సాధారణ పాత్రలు కూడా కన్పించవు. మరోపక్క మంచితనాన్ని గుండె నిండా పొదువుకొని, అతి సహజంగా స్పందించే మానవతా మూర్తుల పాత్రలు తారసపడుతుంటాయి.

పాఠకులకు ఆ చదివే మనసుందా? చూసే కళ్ళున్నాయా? వినే చెవులున్నాయా? అని ప్రశ్నిస్తుంటాయి. లోకం మీద మంచితనం మీద సడలని విశ్వాసం ఉన్నప్పుడే అలాంటి పాత్ర సృష్టి జరుగుతుందని నిస్సందేహంగా చెప్పవచ్చు.

శివరామయ్య ఆత్మ విశ్వాసానికంతా పునాది అతడి నీతి. ఇతరుల ఎదుట తల వంచుకోవాల్సిన పనేది తాను చేయలేదు. తాను ముందుగా వెళ్తుంటే వెనకవైపు వున్నవాళ్ళు తనను చూసి హేళనగా, ఈసడింపుగా మాట్లాడుకునే అవకాశాలు లేవు. ఒళ్ళు దాచుకోకుండా పనిచేసి పైఅధికారులను మెప్పించి ఆఫీసులో అందరికీ తాను తలలో నాలుకలా మసలుకున్నాడు. ఈ నిర్భయమైన చిత్తవృత్తి శివరామయ్యకు బాగానే ఉపకరించింది. మొక్కవోని ధైర్యంతో అతడు జీవితాన్ని ఎదుర్కొంటూ వచ్చాడు (ఆశయసిద్ధి- 1978)

ఓ మధ్యతరగతి మంచి మనిషి జీవితానికి నిర్వచనంగా రచయిత ఈ మాటలు ఉటంకించాడు. జీవిత గమ్యం గమనం ఈ పేరాలో ఇరికించిన తరువాత కథను నడిపించడమే ఓ అద్భుత కథగా పాఠకుల ముందుంటుంది.

మంచి కథలు రాయాలనుకునే రచయితలనే కాదు మంచిగా బతకాలనుకునే వారికి కూడా ఈ కథలు ఎంతో స్ఫూర్తినిస్తాయి.

- శైలి



బాస్కెట్‌బాల్ పాప

'పాప చూస్తే...పుచ్చపువ్వులాగా చక్కగా నవ్వుతోంది! పొట్ట కింది భాగం అంతా ఏమైంది! ఆ స్థానంలో ఫుట్‌బాల్ కనిపిస్తోందేంటి? ఇవేమైనా ట్రిక్ ఫొటోలా?' అనుకుంటున్నారా!

కానే కాదు! అన్నీ నిజం ఫొటోలే. మీరు చూస్తోంది కూడా వాస్తవమే.

ఇంత బాధలోనూ చిరునవ్వులు చిందిస్తున్న పాపకు మూడేళ్ల వయసులో ఓ యాక్సిడెంట్ అయ్యింది. తను ప్రాణాలతో వుండాలంటే కాళ్లు తీసేయాలన్నారు వైద్యులు. వైకల్యంతోనైనా పాప కళ్ల ముందు నిలిస్తే చాలనుకున్న తల్లిదండ్రులు అందుకు అంగీకరించారు.

ఇంతకీ ఈ సంఘటన ఎక్కడ జరిగిందనుకుంటున్నారు? చైనాలో. పాప పేరు క్వియాన్ హాంగియాన్‌క్వియాన్. వీరు నివసించేది జుహువాన్‌జియాలో. కృత్రిమ కాళ్లు పెట్టించడానికేమో వారిది పేద కుటుంబం. దాంతో పాప నడవడానికి వీలుగా ఓ ఫుట్‌బాల్‌ను వీపు కింది భాగంలో తగిలించారు. చేతులకు చెక్క ముక్కలను ఆధారంగా చేసుకొని తన పనులు తను చేసుకుంటుంది. పాఠశాలకు కూడా వెళ్తుంది. అన్నీ చెరగని చిరునవ్వుతోనే చేస్తుంది.

ఇది చదివాక పాపం ఇక జీవితాంతం ఇంతేనా! అనుకుని బాధపడుతున్నారా?

అదంతా గతం. ఇటీవలే చైనా ప్రభుత్వం పాపకు కృత్రిమ కాళ్లు పెట్టించింది. వాటితో ఇప్పుడిప్పుడే నడక నేర్చుకుంటోంది.

అయితే ఒక విషయం తెలిస్తే మాత్రం ఆశ్చర్యపోవాల్సిందే. 2010లో లండన్‌లో జరిగే పారాలింపిక్స్‌లో ఈతపోటీలో పాల్గొనాలనుకుంటోందీ చిన్నారి. అందుకుగాను శిక్షణ తీసుకుంటోంది. రోజుకు 2000 మీటర్ల దూరం ఈదుతోందంటేనే పాప కష్టకోసం ఎంతగా సాధన చేస్తోందో అర్థమౌతోంది కదూ.

తమాషా ఏంటంటే... ఈత కొలను దగ్గర ఇప్పటికీ అప్పడప్పడు బాస్కెట్‌బాల్‌నే తగిలించుకుని అటూ ఇటూ నడుస్తుంటుంది. అదేంటని అడిగితే దీనిమీదైతేనే సుళువుగా కదలొచ్చంటుంది కళ్లు మూసుకుపోయేట్లు నవ్వుతూ.

తాబేలు - బెస్తవాడు

-కె.సాహిల్



ఒకప్పుడు చైనాలో ఓ బెస్తవాడు వుండేవాడు. అతని పేరు తారో. రోజూ సముద్రపు ఒడ్డుకెళ్లి చేపలు పట్టుకొచ్చేవాడు. అదే అతని జీవనాధారం. అలా చేపలమ్మగా వచ్చిన డబ్బు సరిగ్గా తినడానికి సరిపోయేది. ఇది అతని భార్యకు కొంత బాధగా వుండేది. "అందరూ అలా సంపాదించుకుంటున్నారు. ఇలా సంపాదించుకుంటున్నారు. మనమూ వున్నాం. ఎందుకూ! ఏ పూటకాపూటకు కష్టం చేయాల్సిందే. రోగమొచ్చినా రొష్టొచ్చినా కడుపు మాడ్చుకుని బతకాలి.." అంటూ గోల చేసేది. ఎలాగైనా సరే ఎక్కువ డబ్బు సంపాదించమని పోరుతుండేది. అయినా తారో మాత్రం ఏం మాట్లాడేవాడుకాదు.

ఓరోజు అతను చేపలవేటకు బయలుదేరతాడు. అలా సముద్రం ఒడ్డున నడుస్తుండగా నలుగురు పిల్లలు కలిసి ఓ తాబేలును కర్రలతో కొడుతుంటారు. నోరు లేని దాన్ని కర్రలతో కొట్టడం ఏమాత్రం నచ్చదతనికి. వెంటనే వాళ్లను వారించి పంపేస్తాడు. తాబేలు మెల్లగా సముద్రం లోపలికి వెళ్లిపోతుంది.

ఆ సంగతి అప్పటితోనే మర్చిపోతాడు తారో. మరునాడు చేపలవేటకెళుతున్న అతనికి అదే తాబేలు కనిపిస్తుంది. పైగా అది తనవైపే రావడం చూసి తారో ఆశ్చర్యపోతాడు. అంతేనా! ఆ తాబేలు మాటలు కూడా చెప్పడం అతడిని మరింత ఆశ్చర్యపరుస్తుంది. "నిన్న నన్ను పిల్లల బారినుంచి కాపాడావు. చాలా సంతోషం. అందుకుగాను నేను నీకు ఓ విందు ఇవ్వాలనుకుంటున్నాను. మా ఇంటికి తప్పకుండా వచ్చి మా వాళ్లందర్నీ సంతోషపరచాలి" అంటుంది వినయంగా, మృదువుగా. తాబేలు మాట్లాడడం తనను విందుకు పిలవడం అంతా వింతగా వున్నా...సరేనంటాడు. తాబేలు వీపుమీద కూర్చుంటాడు. తాబేలు ఉత్సాహంగా సముద్రం లోపలికి లోలోపలికి తీసుకెళుతుంది తారోని. అలా వెళ్లీ...వెళ్లీ... ఒక సుందరభవనాన్ని చేరుకుంటారు. భవనం అంతా కాంతులతో వెలిగిపోతుంటుంది. బోలెడంత మంది పరివారం హడావిడిగా అటూ ఇటూ తిరుగుతుంటారు. భవనం లోపలికి అడుగుపెట్టగానే తాబేలు కాస్తా అందమైన అమ్మాయిగా మారిపోతుంది. ఆమె ఓ జలకన్యని అతనికి అప్పడే తెలుస్తుంది. ఆనందంగా విందులో పాల్గొంటారంతా. రుచికరమైన వంటకాలతో కూడిన భోజనం పెడుతుంది. తాగినంత మద్యం పోయిస్తుంది. అన్నీ... తిని తాగి... సంతోషంగా ఇంటికి వెళతానంటాడు తారో. వీడ్కోలు పలికే సమయంలో జలకన్య అతనికి ఒక భరిణ ఇస్తూ ఓ మాట చెప్తుంది.

"ఈ పెట్టెను నువ్వు మూడు సార్లు ఉపయోగించవచ్చు. తెరిచిన ప్రతిసారీ నేను ప్రత్యక్షమై నీ కోరిక తీరుస్తాను" అంటుంది. తారో సంతోషంగా ఇంటికి చేరతాడు. అతడు చెప్పినదంతా విని భార్య ఎంతో ఆనందపడిపోతుంది. వెంటనే పెట్టె తెరిచి బోలెడంత డబ్బు, బంగారం ఇవ్వమని కోరుకోమంటుంది. అయిష్టంగానే పెట్టె తెరిచి "నాకు లెక్కపెట్టలేనంత డబ్బు, బంగారం కావాలి. ఇస్తావా నేస్తం?" అనడుగుతాడు దైన్యంగా. జలకన్య అవన్నీ ప్రసాదించి వెళ్లిపోతుంది.

కొద్దిరోజులకే మళ్లీ నస మొదలెడుతుంది తారో భార్య. "ఇంత డబ్బు వుండి ఏం లాభం. బెస్తవాని భార్యగానే ఇక్కడ సముద్రపు ఒడ్డున బతకాల్సివస్తోంది. మనం కూడా నగరంలో దర్జాగా బతకాలి. పనివాళ్లతో ఇల్లు కళకళలాడుతుండాలి" అంటుంది.

మళ్లీ పెట్టె తెరిచి "నాకు నగరంలో పెద్ద భవంతి కావాలి. ఇంటినిండా నౌకర్లూ, చాకర్లూ కావాలి" అంటాడు. జలకన్య అవన్నీ ప్రసాదించి వెళ్లిపోతుంది.

మళ్లీ కొద్ది రోజులకు తారో భార్య గోల మొదలెడుతుంది. "ఇంత భవంతి వున్నా ఏం లాభం? నేను మహారాణిలా బతకాలి. మహారాణిని కావాలంటే నువ్వు రాజువి కావాలి. వెంటనే జలకన్యను ఇది అడుగు" అంటుంది. తారో అయిష్టంగానే ఇదీ అడుగుతాడు. జలకన్యకు కోపం వస్తుంది. వెంటనే "నీకు తాహతకు మించి కోరికలు తీర్చాను. అదీ నీకోసం చేశాను. అత్యాశాపరురాలైన నీభార్యకు బుద్ధిరావాలంటే మాత్రం నువ్వు పాత ప్రదేశానికి వెళ్లాల్సిందే. నన్ను క్షమించు మిత్రమా!" అంటూ వెళ్లిపోతుంది. ఆ తర్వాత చూసుకుంటే ఏముంది? తారో, అతని భార్య తిరిగి సముద్రపు ఒడ్డున కంతలు పడిన తాటాకుల కొంపలో వుంటారు. అది చూసి బెస్తవాడు వ్యంగ్యంగా నవ్వుతూ..

"నీ కోరిక తీరింది చూశావా! ఈ ఇంటికి నువ్వే రాణివి. నేను రాజుని. అదిగో ఆ రంధ్రాల ద్వారా మనింటికి పగలు సూర్యుడు, రాత్రి చంద్రుడు కాపాలా కాస్తారు. సరేనా!" అంటాడు. అతని భార్య మాత్రం మారు మాట్లాడకుండా ఏడుస్తూ కూర్చుంటుంది.